# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 75 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 06 మే 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 75 06-05-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




**ఏపీలో వర్ష బీభత్సం**
**8 మంది మృతి**

2 లో..

## ప్రధాని మోదీతో రక్షణ కార్యదర్శి భేటీ

**పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మోదీతో రక్షణ కార్యదర్శి భేటీ**
**ఏప్రిల్ 22 పహల్గామ్ దాడి అనంతరం భద్రతా పరిస్థితి, సైనిక సన్నద్ధతపై చర్చ**
**పశ్చిమ సరిహద్దుల్లో తాజా పరిస్థితిని**

**ప్రధానికి వివరించిన రక్షణ కార్యదర్శి**
**పాకిస్తాన్ నుంచి కొనసాగుతున్న కాల్పుల విరమణ ఉల్లంఘనలు**
**ఇప్పటికే పాక్‌పై పలు దౌత్యపరమైన చర్యలు చేపట్టిన భారత్**



పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ నేడు ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్ తీసుకుంటున్న ప్రతిస్పందన చర్యలు, సైనిక సన్నద్ధతపై ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తాజా భద్రతా పరిస్థితి, ముఖ్యంగా పశ్చిమ సరిహద్దుల్లో సైనిక పరమైన ఏర్పాట్ల గురించి రక్షణ కార్యదర్శి ప్రధానికి వివరించినట్లు సమాచారం. ఒకేసారి బహుళ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే వ్యూహాలు, రక్షణ సరఫరాలకు అంతరాయం కలగకుండా చూసే చర్యలపై కూడా చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గత వారం రోజులుగా ప్రధాని మోదీ త్రివిధ దళాధిపతులు, ఇతర ఉన్నతాధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమావేశం జరిగిన రోజే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి, పహల్గామ్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జపాన్ రక్షణ మంత్రి జనరల్ నకతానితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఉగ్రవాదంతో సహా ప్రాంతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్‌కు సహకరిస్తామని జపాన్ పునరుద్ఘాటించింది. ఇదిలావుండగా, నియంత్రణ రేఖవెంబడి పాకిస్తాన్ గత 11 రోజులుగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే ఉంది. గత రాత్రి కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరీ సహా పలు ప్రాంతాల్లో పాక్ దళాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డాయని భారత సైన్యం పేర్కొంది.



## ఏపీలో నేటి నుంచి ఆధార్ క్యాంపులు

అమరావతి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి రెండు విడతల్లో ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 2025, మే5 నుంచి 8వ తేదీవరకు ఒక విడత, 12 నుంచి 15వ తేదీ వరకు మరో విడతలో ఈ క్యాంపులను నిర్వహించనున్నట్లు తెలిపింది. 5 నుంచి 7, 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయసుగల వారు ఈ ప్రత్యేక క్యాంపుల్లోని సేవలను వినియోగించుకోవాలని సూచించింది.



## రాహుల్‌గాంధీ పౌరసత్వ పిటిషన్ కొట్టివేసిన అలహాబాద్ హైకోర్టు

న్యూఢిల్లీ మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌ను అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ సోమవారం కొట్టివేసింది. ఈ కేసుపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని విచారణ సందర్భంగా లక్నో బెంచ్ కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం కేసును కొట్టివేసింది. రాహుల్ గాంధీ భారతదేశం, బ్రిటన్ పౌరసత్వాలను కలిగి ఉన్నారని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 84 (ఎ) ప్రకారం ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడంటూ కర్ణాటకకు చెందిన బిజెపి కార్యకర్త విఘ్నేష్ శిశిర్ ఈ పిల్‌ను దాఖలు చేశారు. గత విచారణలో రాహుల్ గాంధీ భారతీయ పౌరుడా? కాదా అనే విషయంపై హౌం మంత్రిత్వశాఖ సమర్పించిన నివేదిక పట్ల కోర్టు అసంతఅప్తి వ్యక్తం

- తరువాయి 2లో..

## అత్యంత కఠినంగా నీట్ ప్రశ్నలు

### కన్నీళ్లు పెట్టుకున్న విద్యార్థులు



హైదరాబాద్ మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ఎప్పుడు లేని విధంగా నిన్నజరిగిన నీట్ ప్రశ్నాపత్రం చూసిన విద్యార్థులకు కన్నీళ్లే వచ్చాయి.. ఏ విభాగంలో చూసినా అన్ని కఠినమైన ప్రశ్నలే.. అసలు ప్రశ్న అర్థం చేసుకునేంత సమయం కూడా లేకుండా ఆయోమయానికి గురి చేసే విధంగా ప్రశ్నలు ఈ సారి సంధించారు.. మెరిట్ విద్యార్థులు సైతం పేపర్ ను ఘోల్లు మంటున్నారంటే ఎంత ఘాటుగా అర్థం అవుతుంది. ఇక భౌతిక శాస్త్రం %-% ఫిజిక్స్ లో 16 ప్రశ్నలు బెంబేలెత్తించాయి! రసాయన శాస్త్రంలో 15 ప్రశ్నలు బెదరగొట్టాయి!! బోటనీలో 14, జువాలజీలో ఆరు ప్రశ్నలు చాలా కష్టంగా వచ్చాయి! ఒక్కమాటలో చెప్పాలంటే..

వైద్య విద్యలో ప్రవేశాల నిమిత్తం ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష (నీట్-యూజీ 2025) ప్రశ్నపత్రం ఘాటుగా, అత్యంత కఠినంగా ఉంది!

**మునుపెన్నడూ లేనంత..**

నీట్ యూజీ 2018లో మొదలైంది. నాటి నుంచి కిందటి సంవత్సరం దాకా.. ఏ ఏడాదీ నీట్ ప్రశ్నపత్రం ఇంత కఠినంగా లేదని అధ్యాపకులు, విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫిజిక్స్ ప్రశ్నలు తమను బెంబెలెత్తించినట్లు విద్యార్థులు వెల్లడించారు. నీట్ పేపర్‌లో.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలలో మొత్తం 180 ప్రశ్నలుంటాయి. ఫిజిక్స్‌లో 45 ప్రశ్నలకుగాను 20-25 ప్రశ్నలకు జవాబు రాస్తే చాలా గొప్పేనని నిపుణులు చెబుతున్నారు. మెరిట్ విద్యార్థులు సైతం ఫిజిక్స్‌లో 30ప్రశ్నలకు మించి సమాధానాలు రాయలేకపోయారని.. ఎవరైనా 40ప్రశ్నలకు సమాధానాలు రాస్తే ఆలిండియా ర్యాంకు తథ్యమని వస్తుందని పేర్కొన్నారు. అలాగే, కెమిస్ట్రీలో ఆరు ప్రశ్నలను అత్యంత కఠినంగా ఇచ్చారని, అవి సుదీర్ఘంగా, సమయం ఎక్కువ తీసుకునేలా ఉన్నాయని ఓ ప్రముఖ విద్యా సంస్థలో కెమిస్ట్రీ సీనియర్ ఫ్యాకల్టీగా ఉన్న జె.శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. బోటనీలోనూ ఇదే పరిస్థితి నెలకొందని.. కొన్ని ప్రశ్నలు కష్టంగా ఇచ్చారని ఆయ న వెల్లడించారు. అయితే మెజారిటీ విద్యార్థులు ఆ ప్రశ్నలకు బాగానే సమాధానాలు రాసినట్టు చెబుతున్నారు.

- తరువాయి 2లో..

## ఈ నెలలోనే ఏపీలో అన్నదాత సుఖీభవ పథకం అమలు



**రైతులకు, కౌలు రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ ప్రభుత్వం**
**ప్రతి అర్హులైన రైతు కుటుంబానికి రూ.20,000 ఆర్థిక సాయం**
**మూడు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ**

అమరావతి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల సంక్షేమం దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కు లేకున్నా, ఇతరుల భూములను కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్న కౌలు రైతులకు కూడా ఆర్థిక భరోసా కల్పించాలని సంకల్పించింది. ఇప్పటికే అమలులో ఉన్న 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని కౌలు రైతులకు సైతం వర్తింపజేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 20,000 ఆర్థిక

- తరువాయి 2లో..

## సింహాచలం ప్రమాదంపై నివేదికను సమర్పించిన త్రిసభ్య కమిషన్

అమరావతి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
సింహాచలం ప్రమాదంపై త్రిసభ్య కమిషన్ తన నివేదికను సోమవారం ఎపి ప్రభుత్వానికి సమర్పించింది.గత నెల 30న యాత్రికులపై గోడ కూలిన ఘటనలో ఏడుగురు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిషన్‌ను నియమించింది. ప్రాథమిక నివేదికను కమిషన్ చైర్మన్ సురేష్‌కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు.



## రైతుల పట్ల కూటమి.. ప్రభుత్వం నిర్లక్ష్యం: జగన్

### అకాల వర్షాలు - రైతుల పట్ల ప్రకృతి నిషఉరత, ప్రభుత్వ నిర్లక్ష్యం



అమరావతి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాతలను తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టేశాయి. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం వంటి జిల్లాల్లో వర్షాలు అత్యధికంగా నమోదు కావడంతో పొలాల్లోనే ఉండే ధాన్యం, పండ్ల తోటలు పూర్తిగా నీటమునిగాయి. వర్షాలు కురుస్తాయని ముందుగానే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టలేకపోవడం రైతులకు పెను నష్టాన్ని మిగిల్చింది. అప్పుడప్పుడే ఫలించే పంటను కోతకు సిద్ధంగా ఉంచిన రైతులు ఒక్కసారిగా విధ్వంసాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో తాము చేసిన పెట్టుబడులన్నీ కోల్పోయామన్న భయంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**"ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి"**

ఈ వ్యవహారంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. తాడేపల్లి నుండి పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో జగన్, అకాల వర్షాల వల్ల రైతులు

- తరువాయి 2లో..

## అడ్వాన్స్ డ్ కోర్సుల్లో శిక్షణ కోసం ఒరాకిల్‌తో .. ఏపీ ప్రభుత్వ కీలక ఒప్పందం

- **మూడేళ్లలో 4లక్షలమందికి ఒరాకిల్ మై లెర్న్ ప్లాట్ ఫాం ద్వారా శిక్షణ**
- **మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఒరాకిల్ - ఎపిఎస్ఎస్డీసి నడుమ ఎంఓయు**

అమరావతి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి చెందుతున్న ఐటి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్ డ్ టెక్నాలజీస్ లో యువతకు శిక్షణఇచ్చి, వర్క్ ఫోర్స్ ను సిద్ధం చేయడానికి ప్రఖ్యాత సంస్థ ఒరాకిల్ తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఒరాకిల్, ఎపిఎస్ఎస్డీసి ప్రతినిధులు ఎంఓయుపై సంతకాలు చేశారు. దీనిద్వారా ఎంపిక చేసిన యువతకు ఒరాకిల్ యూనివర్సిటీ లెర్నింగ్ సబ్ స్క్రిప్షన్ కంటెంట్ ఉచితంగా లభిస్తుంది. మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతలో ఒరాకిల్ క్లౌడ్ నైపుణ్యాల కోసం చేయూత అందించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. తొలిఏడాది లక్షమందికి, రెండు, మూడు సంవత్సరాల్లో లక్షన్నర మందికి చొప్పున మొత్తం 4లక్షలమందికి ఒరాకిల్ మై లెర్న్ డిజిటల్ ప్లాట్ ఫాం ద్వారా శిక్షణ ఇస్తారు. ఒరాకిల్ క్లౌడ్ ఎసెన్షియల్స్, ఓసిఐ ఫౌండేషన్స్, ఎఐ ఫౌండేషన్స్, డేటా సైన్స్, క్లౌడ్ సెక్యూరిటీ క్యూరేటెడ్ లెర్నింగ్ పాత్స్ పై శిక్షణా

- తరువాయి 2లో..



# సంపాదకీయం

## కులగణనపై మోదీ యూ-టర్న్‌తో ఎవరికి లాభం?

దేశ వ్యాప్తంగా ప్రతిపక్షాలు కొన్నేళ్లుగా కుల గణన డిమాండ్లు వినిపిస్తున్నా... హిందువులంతా ఒక్కటే అని చెబుతూ వచ్చిన బీజేపీ, ఎవరూ ఊహించని విధంగా కుల గణన నిర్వహించాలని నిర్ణయించింది. కుల గణన మీదే రాజకీయాలు నడుపుతున్న ప్రతి పక్షాల నోరు మూయించడానికే బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందా? లేక ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు విరుద్ధంగా తీసుకున్న ఈ నిర్ణయం ఆ పార్టీకి ప్రమాదం తెచ్చిపెట్టనున్నదా అనే చర్చ మొదలైంది.

మన దేశంలో మతం కన్నా కులమే బలమైనది. ఏ రాష్ట్రంలో చూసినా కులం చుట్టే రాజకీయాలు నడుస్తుంటాయి. స్వాతంత్ర్యం అనంతరం 2011లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కులగణన కోసం సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టింది. కానీ, రాజకీయ ఎత్తుగడల మధ్య ఆ డేటాను విడుదల చేయలేదు. తర్వాత అధికారం కోల్పోయిన కాంగ్రెస్... సామాజిక న్యాయం కోసం కులగణన చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నా... బీజేపీ పట్టించుకోనట్టే వ్యవహరించింది.

బీజేపీ సైద్ధాంతిక గురువైన ఆర్ఎస్ఎస్, ముందు నుంచీ కులగణనను వ్యతిరేకిస్తోంది. కులాలకు అతీతంగా హిందువులను ఒకే గొడుగు కింద ఏకం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2023లో ఆర్జేడీ%-%జేడీ(యూ) కూటమి ప్రభుత్వం బిహార్‌లో కులగణనను చేసినప్పుడు కూడా ఆర్ఎస్ఎస్, బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కులగణన చేసినప్పుడు కూడా కుల ఆధారిత ఓటు బ్యాంకు రాజకీయాలను అవి వ్యతిరేకించాయి. ప్రతిపక్ష పార్టీలు కుల విభజనలను రెచ్చగొట్టి ఎన్నికల లబ్ధి పొందుతున్నాయని విమర్శించాయి. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో 'బటెంగే తో కటెంగే' (విడిపోతే చంపబడతాం) అనే నినాదంతో కులగణన డిమాండ్‌ను తెరమరుగు చేసే ప్రయత్నం చేశారు. ప్రధానమంత్రి మోదీ ఈ ప్రచారంలోనే 'ఏక్ హై తో సేఫ్ హై' (ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం) అనే నినాదం ఇచ్చారు. ఇప్పుడు తన యూ%-%టర్న్‌కు ఆయన ఏమని సంజాయిషీ చెప్పుకొంటారు?

### వ్యూహాత్మక నిర్ణయమా?

తెలంగాణ, కర్ణాటకలలో చేపట్టిన కులగణనతో దేశ వ్యాప్తంగా సామాజిక న్యాయం డిమాండ్లు పెరిగాయి. దీనికి తోడు ఈ ఏడాది జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకునేలా బీజేపీపై ఒత్తిడి పెరిగింది. బిహార్‌లో 2015లో నితీశ్ కుమార్ ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వేలో మొత్తం జనాభాలో 65 శాతం ఓబీసీలని తేలింది. ఈ నేపథ్యంలో ఓబీసీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి, ప్రతిపక్ష సామాజిక న్యాయ ఎజెండాను నియంత్రించడానికి బీజేపీ కులగణనకు ఒప్పుకుని ఈ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుందన్న అనుమానం ఉంది. ఆర్ఎస్ఎస్ ఈ నిర్ణయంపై సంయమనంతో స్పందిస్తూ, కులగణన రాజకీయ సాధనంగా మారకూడదని, శాస్త్రీయంగా, సామాజిక అసమానతలను తొలగించేందుకు మాత్రమే జరగాలని చెప్పింది. ఈ స్పందన వారి అంతర్గత అసౌకర్యాన్ని సూచిస్తుంది. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు రోజే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధానమంత్రితో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి తన యూ%-%టర్న్ గురించి ఆయనతో చర్చించే ఉంటారు. కాబట్టి, ఈ నిర్ణయం బీజేపీ సైద్ధాంతిక మార్పు కాదనీ, ఎన్నికల ఒత్తిడి వల్ల తీసుకున్న రాజకీయ నిర్ణయం మాత్రమేననీ స్పష్టమవుతోంది.

2014 నుండి దేశంలో బీజేపీ తన బలం పెంచుకుంటూవస్తోంది. కానీ, తన ఆధిపత్యాన్ని కొనసాగించడానికి వెనుకబడిన వర్గాల మద్దతు చాలా కీలకం. బీజేపీలో అత్యధిక శాతం నాయకులు అగ్రవర్ణాలవారే ఉన్నారు. కాబట్టి, కులగణన వల్ల ఓబీసీలు, ఇతర వెనుకబడిన వర్గాలు అధికారంలో తమ వాటాను డిమాండ్ చేస్తే, పార్టీ బలహీనపడే అవకాశం ఉంది. ఇండియా కూటమి ఎక్కువ కులాలు, సముదాయాలకు ప్రాతినిధ్యం వహిస్తుందనే అభిప్రాయం బీజేపీకి ప్రతికూలంగా మారింది. బీజేపీ రోహిణీ కమిషన్, రాఘవేంద్ర కుమార్ ప్యానెల్ వంటి ఓబీసీ ఉప%-%వర్గీకరణ ప్రయత్నాలు చేసినప్పటికీ, వాటి నివేదికలను విడుదల చేయలేదు. దీనికి విరుద్ధంగా, ప్రతిపక్షం కులగణనకు నిబద్ధత చూపిస్తూ... తాము అధికా రంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన జరిపించి, బీజేపీ శిబిరంలో రాజ కీయ ఒత్తిడిని పెంచింది.

ఈ నిర్ణయం బీజేపీకి స్వల్పకాలిక రాజకీయ లబ్ధిని ఇవ్వవచ్చు, కానీ దీర్ఘకాలంలో అనేక సవాళ్లను తెచ్చిపెడుతుంది. కులగణన హిందూత్వ సిద్ధాంతానికి విరుద్ధంగా, కుల ఆధారిత రాజకీయాలను మరింత బలపరుస్తుంది. ఇది మండల్ 3.0 ఆవిర్భావానికి దారి తీసే అవకాశం కూడా లేకపోలేదు. కులం మన దేశ రాజకీయాల్లో బలమైన శక్తిగా కొనసాగుతోంది. దానిని మతం పేరు చెప్పి తొలగించలేం. ఈ నిర్ణయం బీజేపీ సైద్ధాంతిక పునాదులను కదిలించి, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న ప్రతిపక్షాలకు నైతిక విజయాన్ని అందించింది. 2021లోనే నిర్వహించాల్సిన జనగణన ఇప్పటికీ జరగలేదు. ఈ నేపథ్యంలో కులగణన నిర్ణయం ఎప్పుడు అమలవు తుందో అనే సందేహాలను కొట్టిపారేయలేం!

# పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అంతర్జాతీయ నిపుణుల బృందం

పోలవరం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణుల బృందం సందర్శించింది. ఇక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ బృందం తగు సూచనలు, సలహాలను జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఇవ్వనుంది. అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొన్నెల్లి, సీన్ హించ్ బెర్జర్, జియాన్ఫ్రాన్కో డి సికో, డేవిడ్ బి పాల్ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. వీరితో పాటు పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, కేంద్ర జలసంఘం అధికారులు, సరబ్జిత్ సింగ్ భక్షి, రాకేశ్, అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా, లలిత్ కుమార్ సోలంకి పనులు జరుగుతున్న తీరుపై సమీక్షించారు. ప్రాజెక్టు సీఈ కె.నరసింహమూర్తి, ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు పనుల పురోగతిని వారికి వివరించారు. నిపుణుల బృందం సభ్యులు డయాఫ్రం వాల్ పనులు, ఎగువ కాఫర్ డ్యామ్ పటిష్ఠతపై ఆరా తీశారు.

### కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ

కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. ఇవాళ్టి త్రిసభ్య కమిటీ సమావేశానికి హాజరు కాలేమని అందులో పేర్కొంది. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు నిపుణులు వస్తున్నారని అందులో వివరించింది. ఈ నెల 10 తర్వాత త్రిసభ్య కమిటీ భేటీ ఏర్పాటు చేయాలని ఏపీ ఈఎన్‌సీ కోరారు. ఇకపై కృష్ణా బోర్డు సమావేశాలు విజయవాడలోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో వర్ష బీభత్సం

## 8 మంది మృతి

అమరావతి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. బలమైన ఈదురుగాలులు, పిడుగులు రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టించాయి. పిడుగుల కారణంగా వివిధ ప్రాంతాల్లో ప్రాణ నష్టం సంభవించింది. తిరుపతి జిల్లాలో ముగ్గురు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఐదుగురు మృతి చెందారు. అలాగే ఏలూరు జిల్లాలో పిడుగుపాటుకు ఒకరు మరణించగా, మరొకరు చెట్టు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో మొత్తం మృతుల సంఖ్య 8కి చేరుకుంది.

**అకాల వర్షాలతో ప్రాణ , ఆస్తి నష్టాలు**

ఈ వర్షాలు కేవలం ప్రాణ నష్టాన్ని కాకుండా, ఆర్థికంగా కూడా రైతులను తీవ్రంగా నష్టపెట్టాయి. ధాన్యం కోత పూర్తయ్యే సమయంలో ఈ వర్షాలు రావడంతో, భద్రపరిచిన ధాన్యం తడిసిపోయి నాణ్యత కోల్పోయింది. ఇదే విధంగా అరటి, బొప్పాయి, మామిడి పంటలు ఈదురుగాలులతో నేలరాలిపోయాయి. దీంతో పంటలపై పెట్టుబడి వేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టాన్ని అంచనా వేసేందుకు సంబంధిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు.

**మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా**

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనలపై గమనించి, తక్షణ సహాయ చర్యలు ప్రారంభించినట్టు సమాచారం. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. మరోవైపు ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తూ, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు ఇంకా మెరుగుపడలేదని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## రాహుల్‌గాంధీ పౌరసత్వ పిటిషన్ కొట్టివేసిన అలహాబాద్ హైకోర్టు

చేసింది. రాహుల్‌గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై స్పష్టమైన సమాధానమివ్వాలని.. సవరించిన నివేదిక సమర్పించడానికి కోర్టు ప్రభుత్వానికి 10 రోజుల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే.

## అత్యంత కఠినంగా నీట్ ప్రశ్నలు

జువాలజీలో 3-4 ప్రశ్నలు అర్థం కాలేదని కొంతమంది పేర్కొన్నారు. చాలామంది విద్యార్థులు బోర్డు ఎగ్జామ్ సిలబస్ ను పట్టించుకోలేదని.. వాటిలో ప్రశ్నలు అడగడం లేదన్న ధీమాతో ఉంటున్నారని.. కానీ, ఈసారి వాటి నుంచి కూడా ప్రశ్నలు అడిగారని.. నిపుణులు తెలిపారు. ప్రశ్నపత్రం కఠినంగా రావడంతో విద్యార్థులు ఒకరకమైన బాధతో కనిపించారు. కాగా.. నీట్ ఫలితాలను జూన్ 14న వెల్లడిస్తామని జాతీయ పరీక్షా సంస్థ ప్రకటించింది. ఈ నెలఖారులోగా 'కీ' విడుదలయ్యే అవకాశం ఉంది.

**లాంగ్ టర్మ్ విద్యార్థులకు దెబ్బే..**

తెలంగాణలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని పరీక్ష రాసేవారు 12 నుంచి 15 వేల మంది దాకా ఉంటారు. లాంగ్‌టర్మ్ తీసుకుని నిరుడు పరీక్ష రాసినవారిలో 2వేల మంది వరకూ ఎంబీబీఎస్ సీటు సాధించారని.. ఈసారి మాత్రం ఆ సంఖ్య వెయ్యిలోపే ఉంటుందని నీట్ నిపుణులు అభిప్రాయపడ్డారు. సాధారణంగా నీట్ లాంగ్‌టర్మ్ విద్యార్థులకు భౌతికశాస్త్రమే ఇబ్బందిగా ఉంటుందని.. ఈ ఏడాది అదే కష్టంగా రావడంతో వారు సీటు కొట్టడం చాలా కష్టమని పేర్కొన్నారు.

**779 కాలేజీలు.. 1.17 లక్షల సీట్లు**

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 779 మెడికల్ కాలేజీల్లో 1.17 లక్షల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్ల కోసం దేశవ్యాప్తంగా 22.7 లక్షల మందికి పైగా అభ్యర్థులు పరీక్ష రాశారు.

**450 వస్తే జనరల్‌లో సీటు!**

కిందటి సంవత్సరం చాలామంది విద్యార్థులు 720 మార్కులు సాధించారు. ఈసారి 700 సాధించడమే చాలా కష్టం. ఈ ఏడాది కటాఫ్ బాగా (50-60 మార్కుల మేర) తగ్గే అవకాశం కనిపిస్తోంది. నిరుడు తెలంగాణలో 490 మార్కులు సాధించిన వారికి కన్వీనర్ కోటాలో సీటుదక్కింది. ఈసారి 450 మార్కులు సాధిస్తే జనరల్ కేటగిరీలో సీటు రావొచ్చు.

## ఈ నెలలోనే ఏపీలో అన్నదాత సుఖీభవ పథకం అమలు

సహాయం అందించాలని నిర్ణయించింది. ఈ మొత్తాన్ని మూడు విడతలుగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద అందించే రూ. 6 వేలతో కలిపి ఈ మొత్తం రూ. 20,000 అందజేయనున్నారు. ఈ పథకం కింద అటవీ భూములపై హక్కు పత్రాలు (ఆర్ఓఎఫ్ఆర్) కలిగిన రైతులను కూడా అర్హులుగా గుర్తించనున్నారు. ఈ పథకం అమలు కోసం క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల సహాయకులు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని కౌలు రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని సూచించింది. ఇలా ధ్రువీకరించిన జాబితాలను మే 20వ తేదీలోగా 'అన్నదాత సుఖీభవ' అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ పథకం అమలులో కుటుంబాన్ని (భర్త, భార్య, మైనర్ పిల్లలు) ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. కుటుంబంలోని పిల్లలకు వివాహమైతే వారిని ప్రత్యేక యూనిట్‌గా గుర్తిస్తారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమకు సంబంధించిన పంటలు సాగు చేసే వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది. నయితే, ఈ పథకానికి కొన్ని వర్గాలను మినహాయిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు, గతంలో లేదా ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టులు వంటి వృత్తి నిపుణులు, గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను చెల్లించిన వారు ఈ పథకానికి అర్హులు కారని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

## రైతుల పట్ల కూటమి.. ప్రభుత్వం నిర్లక్ష్యం: జగన్

పడుతున్న నష్టాన్ని తీవ్రంగా విమర్శించారు. వర్షాలపై ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్లే రైతులు ఇన్ని నష్టాల్లో కూరుకుపోయారని ఆయన ఆరోపించారు. పంటల కోతకు తగిన ఏర్పాట్లు చేయకపోవడం, ధాన్యం సేకరణ కేంద్రాలు సమర్థవంతంగా అమలుకాకపోవడం వల్ల ధాన్యం వర్షంలో తడిచిపోయిందని జగన్ విమర్శించారు. ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించకపోవడం వల్ల అప్పటికే రైతులు నష్టపోయారు. అప్పటికీ తమ ధైర్యాన్ని కోల్పోకుండా రబీ పంటలు వేసిన రైతులకు ఇప్పుడు అకాల వర్షాలు మరో అఘాతంగా మారాయి. చేతికి వచ్చిన పంటనీటిలో నాశనమవ్వడంతో, పెట్టుబడులు తిరిగి రావడం అనుమానంగా మారింది. వేలాది ఎకరాల్లో పంట నాశనం కావడంతో రైతులు అప్పుల ఊబిలో మరింతగా కూరుకుపోతున్నారు. వీరి ఆవేదనకు మార్గం చూపాల్సిన ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడం రైతుల్లో కోపాన్ని కలిగిస్తోంది.

**రైతులను పరామర్శించండి, పరిహారానికి పోరాడండి**

ఈ పరిస్థితుల్లో జగన్ పార్టీ నేతలకు రైతులను వ్యక్తిగతంగా పరామర్శించాల్సిందిగా సూచించారు. రైతుల బాధలను నేరుగా తెలుసుకోవాలని, బాధితుల కోసం పరిహారం అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని స్పష్టం చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని, రైతులకు నష్ట పరిహారం వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వైసీపీ శాసన సభ్యులు, స్థానిక నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రైతులతో మమేకం కావాలని జగన్ స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ప్రకృతి ప్రకోపం సహజమే కానీ, ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా పనిచేస్తే నష్టాన్ని తగ్గించవచ్చు. కానీ ప్రభుత్వం నిర్వాకంగా వ్యవహరిస్తే, అన్నదాత నష్టాల పాలవుతూనే ఉంటాడు. ప్రస్తుతం రైతుకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది. పంట కోల్పోయిన రైతులకు న్యాయం జరగాలి. వారి కష్టం వృథా కాకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలి. అప్పుడే నిజంగా రైతు భరోసా అని చెప్పుకోవచ్చు.

## ఏపీ ప్రభుత్వ కీలక ఒప్పందం

కార్యక్రమాలు ఉంటాయి. అప్ డేటెడ్ వర్షన్స్ లో గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ల కోసం లెర్నింగ్ కంటెంట్ ను ఎప్పటికప్పుడు నవీకరణ చేసి అభ్యర్థులకు అందిస్తారు. అదనపు మద్దతు, నెట్ వర్కింగ్ కోసం ఒరాకిల్ యూనివర్సిటీ కమ్యూనిటీలో అభ్యర్థులకు యాక్సెస్ కూడా లభిస్తుంది. ఒరాకిల్ ఇన్ హౌస్ బృందం అభివృద్ధి చేసిన ఈ కోర్సులను నేర్చుకోవడానికి అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఒరాకిల్ అందించే ఎస్ డిఐ సేవలను అభ్యర్థులు నమోదు చేసుకోవడానికి స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ప్రత్యేకంగా వెబ్ సైట్ రూపొందిస్తుంది. ఒరాకిల్ నిర్దేశించిన అర్హత ప్రమాణాలకు లోబడి అభ్యర్థులను ఎంపికచేస్తారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డీసీ ఎండి %డ% సిఇఒ గణేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ దినేష్ కుమార్, ఒరాకిల్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శైలేంద్రకుమార్, సీనియర్ సేల్స్ డైరక్టర్ దేబప్రియ నందన్, వైస్ ప్రెసిడెంట్ (జపాక్ స్కిల్ డెవలప్ మెంట్) తపస్ రాయ్, టెరిటరీ సేల్స్ మేనేజర్ షకీల్ అహమ్మద్ మొహమ్మద్, ప్రిన్సిపాల్ క్లౌడ్ ఆర్చిటెక్ట్ వెంకటశివ నక్కా, కంట్రీ హెడ్ అశ్లేష ఖండేపార్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వందేభారత్ ట్రైన్
# నర్సాపూర్ వరకు పొడగింపు!



**అమరావతి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఆంధ్రప్రదేశ్ రైల్వే వ్యవస్థలో ఇటీవల కాలంలో వందే భారత్ రైళ్ల ప్రవేశం ఒక భారీ మలుపు తీసుకొచ్చింది. అధునాతన సాంకేతికత, వేగం, సౌకర్యాల పరంగా దేశంలో వేగంగా ఆమోదం పొందిన ఈ రైళ్లు ఇప్పుడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విస్తరిస్తుండటం ఆనందకరం. తాజాగా, వందే భారత్ రైలు చెన్నై-విజయవాడ మార్గాన్ని నర్సాపురం వరకు పొడిగించాలనే ప్రతిపాదన అధికారికంగా ముందుకొచ్చింది. ఇది పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు పండుగ లాంటి శుభవార్తగా మారింది.

**%విశాఖ %-% సికింద్రాబాద్ వందే భారత్ మార్గానికి ఇప్పటికే విస్తరణ**
ఇంతకుముందు దక్షిణ మధ్య రైల్వే విశాఖపట్నం %-% సికింద్రాబాద్ వందే భారత్ ట్రైన్‌కు సామర్లకోట, ఏలూరు స్టేషన్లలో హాల్టింగ్ అందించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ చేశారు. ఈ చర్యలతో ఆ ప్రాంతాల ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందుతున్నాయి. ఇదే తరహాలో ఇప్పుడు నర్సాపురం వరకు వందే భారత్ పొడిగింపు కోసం ముమ్మరంగా ప్రణాళికలు రూపొందించబడుతున్నాయి.

**విజయవాడలో నిలిచే సమయం %-% ముఖ్యమైన సమస్య**
ప్రస్తుతం చెన్నై నుండి విజయవాడ వరకు నడుస్తున్న వందే భారత్ రైలు విజయవాడలో ఎక్కువసేపు నిలిచి ఉంటుంది. దీని వల్ల మిగిలిన రైళ్లకు ప్లాట్‌ఫారమ్ అందకపోవడం, షెడ్యూల్ గందరగోళం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ఈ రైలును నర్సాపురం వరకు పొడిగిస్తే, ప్రయోజనకరమని రైల్వే శాఖ భావిస్తోంది. ఈ వందే భారత్ రైలును మొదటి భీమవరం వరకు పొడిగించాలని భావించిన ఆ ఆలోచనను విరమించుకుంది. భీమవరంలో ఈ రైలును ఆపితే బోగిలలో నీళ్లు నింపడానికి అక్కడ సౌకర్యాలు లేకపోవడంతో రైల్వే శాఖ ఈ నిర్ణయాన్ని విరమించుకొని, మచిలీపట్నం వరకైనా పొడిగించాలని ఆలోచించింది.

**నర్సాపురం వైపు పొడిగింపు వెనుక రాజకీయ ప్రోత్సాహం**
కేంద్ర మంత్రి చొరవతో అక్కడివరకు వందేభారత్ ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నరసాపురం ఎంపీ శ్రీనివాస్ వర్మ, కేంద్రమంత్రి కావడంతో ఆయన నరసాపురం వరకు వందే భారత్ ను పొడిగిస్తే బాగుంటుంది అన్న ప్రతిపాదనను తెరమీదకు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఏలూరు మీదుగా వందే భారత్ నడుస్తుందని, నరసాపురం వైపు కూడా వందే భారత్ నడిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో రైల్వే శాఖ మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఈ మార్గ విస్తరణకు బలమైన ఆధారం ఏర్పడింది.

**నర్సాపురం స్టేషన్లో శరవేగంగా పనులు**
వందే భారత్ రైలు నర్సాపురం వరకు వచ్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటులో భాగంగా, రైళ్లో నీటి నింపే పైప్లైన్, ట్రాక్ మెరుగుదల, స్టేషన్ పునరుద్ధరణ వంటి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. విజయవాడలో నిలిపే బదులుగా రైలును నర్సాపురం వరకు పొడిగిస్తే, రైల్వే నెట్‌వర్క్‌కు వ్యాపకత పెరుగుతుంది. పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రయాణికులు నేరుగా చెన్నై వెళ్లే అవకాశం పొందుతారు. ఇది విద్యార్థులు, వ్యాపారస్తులు, పర్యాటకుల కోసం కూడా ప్రయోజనకరం. పైగా, ఇతర రైళ్లపై ఒత్తిడి తగ్గుతుంది.

## మహిళా ఉద్యోగులకు గుడ్‌న్యూస్..ఇక నుంచి 180 రోజులు సెలవులు!



**అమరావతి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
**మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వివాహిత మహిళలకు ఇచ్చే మెటర్నిటీ లివ్ (ప్రసూతి సెలవులు)లను చంద్రబాబు సర్కార్ పొడగించింది. మెటర్నిటీ లివ్‌లను 120 నుంచి 180కి పెంచింది. అంతేకాదు ఇద్దరు పిల్లకు మాత్రమే లివ్‌లు వర్తింపు అనే నిబంధనను కూడా ప్రభుత్వం తొలగించింది. మెటర్నిటీ లివ్‌లను 180 రోజులకు పెంచుతూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుకోగా.. ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మహిళా ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళా ఉద్యోగుల సమస్యలపై ఫోకస్ పెడతామని ఎన్నికల సమయంలో నేతలు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకోగా.. తాజాగా మెటర్నిటీ లివ్‌లను పొడగించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ లివ్‌లు 120 రోజులు ఇస్తున్నారు. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ఇస్తున్న తరహాలోనే 180 రోజులు ఇవ్వనున్నారు. అంతేకాదు ఇక నుంచి ఎంతమంది పిల్లల్ని కన్నా.. మెటర్నిటీ లివ్‌లు మాత్రం యథావిధిగా వర్తింస్తాయి. మహిళా ఉద్యోగుల వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## ఉండవల్లి నివాసంలో
# లోకేష్ 61వ రోజు ప్రజాదర్బార్
### సమస్యలు విన్నవించేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన సామాన్య ప్రజానీకం



**ఉండవల్లి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రాష్ట్రవ్యాప్తంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న సామాన్య ప్రజానీకానికి మొదటి రోజు నుంచి అండగా నిలుస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం ఉదయం ఉండవల్లి నివాసంలో 61వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తమ సమస్యలు విన్నవించేందుకు వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున సామాన్యులు ఉండవల్లి నివాసానికి తరలివచ్చారు. పెన్షన్, భూ సంబంధిత సమస్యలు, ఉద్యోగ, ఉపాధి, వైద్య, ఆర్థికసాయం కోసం పెద్దఎత్తున ప్రజాదర్బార్ కు తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా విన్నపాలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పలు అర్జీలపై అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.
శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని అంబేద్కర్ యూనివర్సిటీలో పనిచేస్తుండగా తన భర్త విద్యుత్ షాక్ కు గురై 2020లో మరణించాడని, కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని చిలకపాలెం గ్రామానికి చెందిన డి.రేవతి మంత్రి లోకేష్ ను కలిసి విన్నవించారు. యూనివర్సిటీ యాజమాన్యానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ భారంగా మారిందని, తన ఇద్దరు పిల్లల చదువుల కోసం తనకు ఏదైనా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో తమ 0.34 ఎకరాల భూమిని అధికారులు అన్యాక్రాంతం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన పడాల రాములు మంత్రి లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. తమకున్న ఏకైనా ఆధారాన్ని రక్షించాలని కోరారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంత్రి లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రంథాలయాలు నిరాదరణకు గురయ్యాయని, పుస్తకాల కొనుగోళ్లు నిలిచిపోయాయని, నిర్వహణ సక్రమంగా లేదని, విద్యాసంస్థల్లోనూ గ్రంథాలయాల నిర్వహణ నామమాత్రంగా ఉందని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రంథాలయాల అభివృద్ధికి, పునర్వికాసానికి అవసరమైన సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని సమైక్య యూత్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాల నుంచి కొయ్యలగూడెంలో డిగ్రీ కాలేజీ లేక పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. కళాశాల ఏర్పాటునకు ఇప్పటికే శాఖపరమైన పనులు పూర్తయ్యాయని, త్వరితగతిన పరిపాలన అనుమతులు మంజూరు చేసి మూడు దశాబ్దాల కలను నెరవేర్చాలని కోరారు. బీఎస్సీ నర్సింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఒంగోలు పట్టణం మామిడిపాలెంకు చెందిన ఏ.మౌనిక మంత్రి లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పుట్టుకతో దివ్యాంగుడు అయిన తన కుమారుడికి దివ్యాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని విజయవాడ పోరంకికి చెందిన ఐ.వరప్రసాద్ మంత్రి లోకేష్ ను కలిసి విన్నవించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కవులూరులో తమకు నివేశన స్థలాన్ని మంజూరు చేసి ఇంటి పట్టా కూడా ఇచ్చారని, ఈ రోజు వరకు సదరు స్థలాన్ని చూపించలేదని విజయవాడ జక్కంపూడికి చెందిన అన్నమరాజు ముత్యాలు మంత్రి లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమకు మంజూరు చేసిన స్థలం జాడ చూపించి, ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. 2017-18 అసిస్టెంట్ ప్రొఫెసర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్వాలిఫైడ్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. కడప- రేణిగుంట మధ్య జాతీయ రహదారి -716 విస్తరణలో భాగంగా తన ఇంటిని అధికారులు సేకరించారని, అయితే ఇంటి నిర్మాణానికి మాత్రమే నష్టపరిహారం చెల్లించి, ఇంటి స్థలానికి నష్టపరిహారం ఇవ్వకుండా వైసీపీ హయాంలోని భూసేకరణ అధికారులు వేధిస్తున్నారని తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన కె.సుబ్రహ్మణ్యం మంత్రి లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి ఇంటి నిర్మాణం, స్థలానికి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరి వినతులు పరిశీలించి తగిన న్యాయం చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.ం



## డాక్టర్ కావాలనే కోరికతో
# నీట్ పరీక్ష రాసిన బామ్మా



**అమరావతి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కాకినాడకు చెందిన ఈ 72 ఏళ్ల వృద్ధురాలు చదువుకోవాలనే ఆసక్తి ఉంటే వయసు ప్రతిబంధకం కాబోదని నిరూపించారు. నగరానికి చెందిన పోతుల వెంకటలక్ష్మి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్ష నీట్ రాశారు. ఆమె ఉత్సాహాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. పరీక్షా హాలులో ఆమె ధైర్యంగా, నవ్వుతూ అడుగు పెట్టిన దృశ్యం ఎంతో మందికి మోటివేషన్‌గా నిలిచింది. ఈ వయస్సులోనూ విద్యపై ఉన్న ఆసక్తి ఆమెను ఈ స్థాయికి తీసుకువచ్చింది. ఆమె చూపించిన పట్టుదల %-% యువతకు ఒక గొప్ప ఉదాహరణ. “ఇప్పటికీ చదవాలనిపిస్తోంది, నాలో ఆసక్తి చావలేదు,” అని ఆమె చెప్పిన మాటలు పరీక్ష కేంద్రం వద్ద ఉన్నవారికి ఆశ్చర్యాన్ని కలిగించాయి.

**తల్లీకూతుళ్ల కల: నీట్ పరీక్షకు ఇద్దరూ హాజరు**
తల్లీ కూతుళ్లు ఇద్దరూ ఒకేసారి నీట్ పరీక్ష రాయడం అరుదైన సంఘటన. ఇది ఖమ్మం జిల్లాలో ఆదివారం జరిగింది. తన కూతురుతో పాటు ఓ మహిళ ఆదివారం జరిగిన నీట్ పరీక్ష రాశారు. అయితే, తల్లీకూతుళ్లు ఇద్దరూ వేర్వేరు జిల్లాల్లో పరీక్ష రాశారు. సూర్యాపేట జిల్లాలోని మంచ్యానాయక్ తండాకు చెందిన భూక్యా సరిత(38) ప్రస్తుతం ఆర్ఎంపీగా పనిచేస్తున్నారు. వివాహం కారణంగా బీఎస్సీ నర్సింగ్ చివరి సంవత్సరంలో చదువుకు ఫుల్ స్టాప్ పెట్టేశారు. సరిత, భూక్యా కిషన్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు కావేరిని డాక్టర్ చేయాలనే ఉద్దేశంతో నీట్ పరీక్షకు శిక్షణ ఇప్పించారు. ఆ సమయంలోనే తాను కూడా పరీక్ష రాయాలని సరిత నిర్ణయించుకుని కూతురుతో పాటు సిద్ధమయ్యారు. ఆదివారం తల్లి సరిత సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కుమార్తె కావేరి ఖమ్మం ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్ష రాశారు. తల్లి కూడా తనతో పాటే నీట్ పరీక్ష రాయటం సంతోషంగా ఉందని ఇద్దరం కలిసి ఖమ్మంలో ఒకే గదిలో ఉండి కోచింగ్ తీసుకున్నామని కూతురు కావేరి చెబుతోంది. భర్త సహకారంతో పిల్లలతో పాటు తాను కూడా కోచింగ్ తీసుకుని నీట్ ఎగ్జామ్ రాసానని సరిత చెబుతోంది. చదువుకోవాలనే పట్టుదల ఉంటే వయస్సు, వివాహం, కుటుంబ బాధ్యతలు ఏమాత్రం అడ్డు కాదని సరిత చెబుతున్నారు. కూతురుతో పాటు తల్లి కూడా నీట్ ఎగ్జామ్ రాయడాన్ని పలువురు అభినందిస్తున్నారు.



## అమ్మవారికి సారె సమర్పించిన మంత్రి నారా లోకేశ్

**మంగళగిరి మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం కంఠంరాజకొండూరు గ్రామంలో భక్తిశ్రద్ధలతో కూడిన రోజు సాగింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈరోజు అక్కడ పర్యటించారు. శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థాన పునఃప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గ్రామానికి చేరుకున్న వెంటనే మంత్రికి భక్తులు ఘన స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల మధ్య ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించారు. మంత్రికి ఈ ఆదరణ చూసి గ్రామం ఎంత ఆత్మీయంగా ఎదిగిందో తెలుస్తోంది.ప్రధాన ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని లోకేశ్ ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, గాజులు, సారెలను సమర్పించారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు.అనంతరం ఆలయ జ్ఞాపికను ఆయనకు అందజేశారు.ఇంతటితో %వీఱఅఱర్వతీ% లోకేశ్ ఆలయ దర్శనాన్ని ముగించలేదు. ఆయన ఆలయ ప్రాంగణంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉపాలయాలను సందర్శించారు. అక్కడ కూడా పూజలు నిర్వహించి భక్తిభావంతో తీర్థప్రసాదం స్వీకరించారు.లోకేశ్ ఆలయానికి వచ్చిన సమయానికి గ్రామం మొత్తం సందడిగా మారింది. పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు ఆయనను చూసేందుకు తరలివచ్చారు. యువత, మహిళలు, వృద్ధులు కూడా ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.తర్వాత మంగళగిరికి తిరుగు ప్రయాణంలో లోకేశ్ మళ్లీ కదలాడు.మార్గంలో కాజ-చినవడ్లపూడి మధ్య ఉన్న బకింగ్‌హాం కాలువను పరిశీలించారు. కాలువలో భారీగా పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆయన దృష్టికి వచ్చింది.వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిస్థితి %ఎవశ్రీఖుబ% కి ఆందోళన కలిగించింది. రైతులకు నీరు జమకాకుండా ఉండాలని స్పష్టంగా ఆదేశించారు. కాలువను శుభ్రం చేయాలని అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి ముఖ్యంగా కనిపించారు.అలాగే గుంటూరు టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మండల అధ్యక్షురాలు కేసమనేని అనిత కూడా హాజరయ్యారు. వారి సమర్థనతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.








డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

మంగళవారం 06 మే 2025

# గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలి

## - కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు



**రావులపాలెం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం సోమవారం ఎంపీపీ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ శాఖల అధికారులతో ఆయా శాఖల ప్రగతిపై సమీక్షించారు. ధాన్యం కొనుగోలు, విద్యుత్, తాగునీరు తదితర సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. మండలంలో 18,900 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా 9 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని మండల వ్యవసాయాధికారి బి.మీనా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో విద్యుత్, తాగునీరు సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల అభివృద్దే దేశాభివృద్ధిగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. లక్ష్యాల మేరకు ధాన్యం కొనుగోలు చేసేలా, ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం 1121 రకం ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1725 కి కొనుగోలు చేస్తుందని చెప్పారు. అలాగే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లి లక్ష్యం పెంచేందుకు కృషి చేస్తానని చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీడీవో మహేశ్వరరావు, తహశీల్దార్ ముక్తేశ్వరరావు వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా అముడా కార్యకలాపాలు నిర్వహించాలి

## - జాయింట్ కలెక్టర్ నిషాంతి





**అమలాపురం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నూతనంగా ఏర్పడిన అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (అముడా) కార్యకలాపాలు అత్యంత సమర్థవంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు బోర్డు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, అముడా ఉపాధ్యక్షురాలు టి.నిషాంతి సూచించారు. సోమవారం అమలాపురం అముడా కార్యాలయంలో బోర్డు సభ్యులతో ఆమె మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు కార్యకలాపాలపై చర్చించి ప్రతిపాదనలపై సభ్యుల అనుమతితో పలు తీర్మానాలకు ఆమోదం, పలు సవరణ దిద్దుబాటు చర్యల గూర్చి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అముడా అథారిటీ ఏర్పడిన తర్వాత జీవో నెంబర్ 35 ప్రకారం కార్యాలయ స్థాపన, ఫర్నిచర్ అథారిటీకి సంబంధించిన నిబంధనలు గూర్చి బోర్డు సభ్యులకు వివరించారు. కార్యాలయ నిర్వహణ కార్యాలయంలోనే కార్యనిర్వహక కమిటీ ఏర్పాటు, కమిటీ విధి విధానాలు గూర్చి వివరించారు. అముడా పరిధిలో భవన నిర్మాణ అనుమతులు ఫీజులు నిర్ణయం, లేఅవుట్లు భవనాలు అనుమతులు, కార్యాలయానికి సంబంధించి లాప్ టాప్లు, కంప్యూటర్ల కొనుగోలు అంశాలకు సంబంధించిన సవరణ దిద్దుబాటు చర్యలు, టేబుళ్ళు, కుర్చీలు ఫర్నిచర్ ఏర్పాటు క్యాడర్ ను బట్టి వాహనాల ఏర్పాటు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆఫీస్ సబార్డినేట్ నియమకాలు వికాస ద్వారా చేపట్టుట, లోగో డిజైనింగ్ పంచాయితీ నుంచి డెవలప్మెంట్ చార్జీలు ఆన్లైన్ సాఫ్ట్వేర్ 300 గజాలు పైబడిన అనుమతులన్నింటినీ అముడా పరిధిలోనే ఇచ్చేందుకు సాఫ్ట్వేర్ ఏర్పాటు, పట్టణ ప్రాంతాల్లో కూడా 300 లోపు గజాలకు సంబంధించి అనుమతులను మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ఇస్తారని తెలిపారు. అద్దె భవనంలో అముడా కార్యాలయం కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం అముడా పరిధిలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయని మిగిలినవి రుడా, కుడా పరిధిలో ఉన్నాయని జిల్లా అంతటిని యూనిట్ గా చేసేందుకు ప్రతిపాదించామని అన్నారు. అముడా అథారిటీ ఏర్పడిన తదుపరి రెండు సంవత్సరాలకు అమలాపురం మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని బోర్డు ప్రతిపాదించిందన్నారు. అమలాపురం పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఉపయోగపడేవి ఏమైనా ఉంటే అముడాకు అప్పగించాలని జిల్లా యంత్రాంగాన్ని కోరుతూ బోర్డు తీర్మానించిందన్నారు. అముడా పరిధిలో ఇంజనీరింగ్ ఎస్టేట్ వింగ్ అకౌంటింగ్ విభాగాలను ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా ఏర్పాటుకు బోర్డు ప్రతిపాదించిందన్నారు. సాఫ్ట్ వేర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు కార్యాలయంలో నాలుగు ఏసీలు ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. గ్రామపంచాయితీలలో అముడా కార్యకలాపాలు గూర్చి అవగాహన కొరకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. అముడా ఏర్పడిన తర్వాత 2024- 25 ఖర్చులు నివేదికలను బోర్డు సభ్యులు అనుమతితో ఉపాధ్యక్షులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, బోర్డు సభ్యులు, ట్రాన్స్ కో ఎస్ఈ ఎస్.రాజబాబు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకర్ రావు, రహదారులు భవనాల శాఖ ఎస్ఈ బి.రాము, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీ.కే.పీ. ప్రసాద్, ప్లానింగ్ అధికారి సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టులను సత్కరించిన ఎమ్మెల్యే అయితాబత్తుల



**అమలాపురం, మే 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీయుడబ్ల్యూజె అధ్యక్షుడుగా ఎన్నికైన మండేల బాబి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికైన కొర్లపాటి ప్రదీప్ కుమార్ లను సత్కరించిన అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర టీడీపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు పాల్గొన్నారు.

# గృహప్రవేశ వేడుకకు ఎమ్మెల్యే అయితాబత్తుల

**అల్లవరం, మే 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అమలాపురం నియోజకవర్గం, అల్లవరం మండలం, యెంట్రీకోన గ్రామం వాస్తవ్యులు, సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ గృహప్రవేశం వేడుకకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గం పరిశీలకులు మెట్ల రమణబాబు.. హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో అమ్ముడా చైర్మన్ శ్రీ అల్లాడ స్వామి నాయుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబు రాజు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు...

# వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## - వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి







**అమలాపురం, , మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రైతులు చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు భారీ వర్షాలకు తడిచిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేసారు. సోమవారం ఆయన వైసీపీ నాయకులతో కలిసి జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను, తడిచిన ధాన్యం రాశులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం అమలాపురంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ను కలిసి రైతు సమస్యలపై వినతి పత్రాలు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలో కూర్చుని ఫిడెల్ వాయిస్తున్నారని ఎద్దేవా చేసారు.మన రాష్ట్రంలో రైతు కష్టాల్లో ఉంటే కూటమి నాయకులు మొద్దు నిద్రలో ఉన్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం నియోజకవర్గ సమన్వయకర్త డా పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్, రాజోలు నియోజకవర్గ ఇన్చార్జి గొల్లపల్లి సూర్యారావు, రామచంద్రాపురం నియోజకవర్గ ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్, గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం అధ్యక్షుడు సంసాని నాని, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జిన్నూరి వెంకటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

## -రాహుల్ గాంధీ ఒత్తోడితో కులగణనకు కేంద్ర కేబినెట్ ఆమోదంఇది కాంగ్రెస్ విజయం

## -జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి

**రాజమహేంద్రవరం, మే 05(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




కులమునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో ఇది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విజయమని హర్షం వ్యక్తం చేస్తూ తూర్పుగోదావరిజిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి ఆధ్వర్యంలో సోమవారం రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.మంగళవారపు పేట కొబ్బరికాయల మార్కెట్ సెంటర్ లో జరిగిన పాలాభిషేకం కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బిల్డర్ బాబి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఒత్తోడితో కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి దేశంలో కులగణన చేయకతప్పని పరిస్థితి ఏర్పడిందని,జన గణనలో కులగణన చేర్చుతూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం రాహుల్ గాంధీ విజయమని అన్నారు. దేశంలోని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కులగణన జరపాలని రాహుల్ గాంధీ సూచన మేరకు ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ ప్రభుత్వాలు కులగణన చేపట్టాయని బిల్డర్ బాబి గుర్తు చేశారు.పొరుగున ఉన్న తెలంగాణలో కూడా కుల గణన జరపాలని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే చర్యలు తీసుకున్నారని ఆయన అన్నారు.ఇప్పుడు కేంద్ర కేబినెట్ ఆమోదంతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కులగణన వల్ల బడుగు బలహీన వర్గాలకు, మైనారిటీలకు జనాభా దామాషా ప్రకారం విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో అవకాశాలు లభిస్తాయని బిల్డర్ బాబి పేర్కొన్నారు.ఇది కాంగ్రెస్ విజయమని, అందుకే దేశ ప్రజలంతా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రశంసలు కురిపిస్తున్నారని బిల్డర్ బాబి అన్నారు.

# గ్రామ సమస్యలపై ఎంపీడీవోకి వినతి పత్రం

**టీ. నర్సాపురం, మే 5 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కృష్ణాపురం గ్రామంలోని చెత్త పోగులు, లీక్ అవుతున్న వాటర్ పైప్ లైన్లు, మురికి కాలువల సమస్యలను మండల ఎంపీడీవో మణి కుమారి దృష్టికి బంజారా భజరంగీ భేరి సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ నాయక్, కమిటీ సభ్యుడు ధరావత్ శంకర్ నాయక్ లు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా భూక్యా వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుండి గ్రామంలోకి చెత్తను సేకరించే ఆటో రావడంలేదని, దానివలన ఎక్కడపడితే అక్కడ చెత్త పోగులు ఏర్పడి గ్రామమంతా దుర్వాసన వస్తున్నదని, రాబోయే వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నదని, చెత్త సేకరించే ఆటోను గ్రామానికి పంపించి సమస్యను పరిష్కరించాలని కోరారు. మంచినీటి పైపులు లీకేజ్ అవ్వడం వలన నీటి కొరత సమస్య ఏర్పడుతున్నదని పైపులైన్లు మరమ్మత్తులు చేయాలని, కొన్ని వీధుల్లో నూతన పైప్ లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. మురుగు నీటి సమస్యను పరిష్కరించడం కోసం డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఎంపీడీవో మణికుమారి సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు.

# దాసు సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పాముల ప్రసాద్

**జీలుగుమిల్లి, మే5(తెలుగు రాష్ట్రం విలేకరి):**



మండల నూతన దాసు సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పాముల వర ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సంఘ సమావేశం ఆయన స్వగృహం వద్ద పోలుకొండ నరసింహారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన వరప్రసాద్ మాట్లాడుతూ తనను అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియ జేశారు. మన సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సంఘ సభ్యుల సహకారంతో శుభ అశుభ కార్యక్రమాలను అందరం చక్కగా నిర్వహించుకుందామని తెలిపారు. ఈ నూతన కమిటీలో కార్యదర్శిగా జెట్టి రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా కోటపాటి రమేష్, ఉపాధ్యక్షులుగా పోలుకొండ నరసింహారావు, కోశాధికారిగా బట్టు లక్ష్మి తో పాటు మరో పదహారు మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సంక్షేమ సంఘం ఏర్పాటుకు సహకరించిన పల్లం రవికుమార్ జంగారెడ్డిగూడెం, నేలటూరి సత్యనారాయణ ద్వారకాతిరుమల, కోరం నరేష్ అచ్చన్నపాలెం వారికి నూతన సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యుల బీర రవి, గడ్డం వీరబాబు, గెడ్డం జనార్ధన్, ఉర్ల బాబి, పోలుకొండ నాగు, గెడ్డం పండు, బట్టు గోపి, కోరం చెన్నకేశవులు, భూషి మధు, చెటగోపం నరసింహ, దాస్యం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్న ప్రభుత్వం

# ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి.

**-ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.-పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.-నిర్వాసితులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్న ఎంపీ పుట్టా మహేష్ కుమాం**



పోలవరం,మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రానున్న రెండేళ్లలో ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్య చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి సోమవారం ఎంపీ మహేష్ కుమార్ పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ప్రాజెక్ట్ సమావేశ మందిరంలో పోలవరం పనుల పురోగతిపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా పనుల పురోగతి పెరగాలని, ఇకపై ప్రతి నెల పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తానని ఎంపీ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలోనూ, నిర్వాసితులకు పరిహారం అందించడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఎంపీ ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయని ఎంపీ పేర్కొన్నారు. అలాగే నిర్వాసితులకు రూ. వెయ్యి కోట్లు పరిహారం మంజూరు చేసిందని ఎంపీ తెలిపారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.157 కోట్లు పెండింగ్ ఉందని, భూ సమీకరణకు సంబంధించి రూ.219 కోట్లు చెల్లించాల్సి ఉందని ఎంపీ పేర్కొన్నారు. అలాగే పోలవరం నిర్వాసితులకు నిర్మిస్తున్న పక్కా గృహాలను నాణ్యత ప్రమాణాల మేరకు పూర్తిచేయాలని ఎంపీ మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. పక్కా ఇళ్ల నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడవద్దని, ఫిర్యాదులు వస్తే మాత్రం ఉపేక్షించేది లేదని ఎంపీ స్పష్టం చేశారు. పక్కా ఇళ్లను ఏడాదిలో పూర్తిచేసి, నూతన గృహప్రవేశాలకు తాను హాజరవుతానని ఎంపీ తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేయడం, పోలవరం పూర్తిచేయడమే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీ వెల్లడించారు. అనంతరం కోండ్రుకోటలోని పోలవరం నిర్వాసితులకు సంబంధించిన ఎల్.ఎన్. డి కాలనీని సందర్శించిన ఎంపీ మహేష్ కుమార్ వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎంవి రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి. శ్రీనివాసులు రెడ్డి, ఐటీడీఏ పీవో కే.రాములు, హౌసింగ్ ఈఈ జి.సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఈఈ కె.శ్రీను, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ టి.లత, ఈడబ్ల్యు డిప్యూటీ ఈఈ ఎ.కోటీశ్వరరావు, ఆర్.అండ్.బి డిప్యూటీ ఈఈ సిహెచ్ హరికృష్ణ, ఆర్.అండ్.బి ఈఈ వైవి కిషోర్ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.





## అర్జీల సత్వర పరిష్కారమే ధ్యేయం

**-దివ్యాంగుల వద్దకే వెళ్లి వారి నుండి అర్జీలు స్వీకరించిన కలెక్టర్**





ఏలూరు మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అర్జీదారుల సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారిని గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 226 దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రతిభావంతులు, దివ్యాంగులు వద్దకు వేదిక పైనుంచి కిందికి వచ్చి కలెక్టర్ వెట్రిసెల్వి అర్జీలు స్వీకరించి, వారి సావధానంగా విని వాటి పరిష్కార చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వారితో పాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి. విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్డీఏ పీడీ అర్.విజయరాజు,ఎస్ సి కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజలు అందించే అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టిసారించి అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అందిన అర్జీలు కొన్ని పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామానికి చెందిన కొమ్మిన వెంకటేశ్వరరావు తమ భూసమస్యపై అర్జీని అందజేసి పరిష్కారం తీసుకోవాలని కోరారు. ఏలూరు హనుమాన్ నగర్ కి చెందిన కుక్కర రమాదేవి అర్జీనిస్తూ తన భర్త నరసింహారావు అనారోగ్యంతో మరణించినందున తన జీవనోపాధి కోసం పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. భీమడోలు మండలం ఎం.ఎం.పురంకు చెందిన బుంగ చంద్రరావు అర్జీనిస్తూ తన చేపల చెరువుకు సంబంధించి తనకు ఉన్న భూమి కన్నా తక్కువ ఆన్లైన్ లో నమోదు అయిందని ఈ విషయాన్ని పరిశీలించి మొత్తం భూమి ఆన్లైన్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలను కోరారు. కైకలూరు మండలం ఆలపాడు చెందిన సుందర కనకదుర్గ అర్జీనిస్తూ తమ భూమి అడంగల్ నందు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు పవర్ పేటకు చెందిన పిల్ల హరి నారాయణ రావు అర్జీనిస్తూ దెందులూరు మండలం సోమవార్పుడు లో భీష్మ పూరి కాలనీలో తమ ఫ్లాట్ సర్వే చేసి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేయండి.

**-జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచన.**



ఏలూరు మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రబీ సీజన్లో భాగంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. పోలవరం ప్రాజెక్ట్ సందర్శనకు సోమవారం బయలుదేరిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మార్గమధ్యలో గూటాల, పట్టసం వద్ద రహదారిపై ఆరబోసిన రాశులను ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లక్ష్యం మేరకు దాన్ని సేకరణ పూర్తయిందని అధికారులు చెబుతున్నారని, తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాల వల్ల రహదారులపై ఆరబోసిన ధాన్యం రాశులు తడిసిపోతున్నాయని రైతులు వాపోయారు. తక్షణం స్పందించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి ఫోన్ చేసి రైతుల సమస్యలు వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. వ్యవసాయ శాఖ అధికారి అందుబాటులో ఉండటం లేదని పలు రైతులు ఎంపీ మహేష్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. ఎంపీ మహేష్ కుమార్ వ్యవసాయ శాఖ అధికారికి ఫోన్ చేసి బాధ్యతగా పనిచేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టసం సమీపంలో రహదారి పక్కన ఆరబోసిన మొక్కజొన్న కండేలను పరిశీలించిన ఎంపీ మహేష్ కుమార్ రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న కండెలు ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. మొక్కజొన్న కండెలు ఆరబోసేందుకు ఫ్లాట్ ఫారంలు, గోదాముల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఎంపీ మహేష్ కుమార్ సూచించారు.

## బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనం ప్రారంభం



ఏలూరు మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనాన్ని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరం ఆవరణలో జిల్లా వైద్య విధాన పరిషత్ సమన్వయ అధికారి డా. పాల్ సతీష్ కుమార్,జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఆర్.మాలినిలతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్రీయ బాల సురక్షా రక్ష కార్యక్రమంలో భాగంగా బాలల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈవాహనాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక మంచి కార్యక్రమం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, బాలల ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడానికి కూడా ఇది సహాయపడుతుందన్నారు.రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రల ద్వారా గుర్తించిన లోపల గల పిల్లలను వారికి దగ్గరలో గల ఏలూరు మరియు జంగారెడ్డిగూడెం నందు గల జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం లకు చికిత్స కోసం తీసుకువచ్చి మరల తిరిగి దింపే విధముగా ఉచితంగా సేవలు అందించే విధంగా ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మరియు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రినకు రెండు వాహనములు సమకూర్చడం జరిగిందన్నారు.జిల్లాలో పుట్టుక లోపములు గల పిల్లలను ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మరియు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి కి తీసుకువెళ్ళి అక్కడ చికిత్స అందించి మరల తిరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దించేఈవాహనాలను అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే శిశు సంక్షేమ శాఖ వారిని సమన్వయం చేసుకుని అందరు చికిత్సలు పొందేవిధంగా ఏర్పాట్లు చేయాలినీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణిని కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా. రాజీవ్, ఐసీడీ ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద,ఆర్ బి ఎస్ కె జిల్లా ప్రోగ్రాం అధికారి కే నరేంద్ర కృష్ణ, జిల్లా మేనేజర్ బొప్పన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే వేలల్లో అపరాధ రుసుం

**-తాళ్లపూడి ఎస్.ఐ. టి.రామకృష్ణ**



తాళ్లపూడి, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రవాణా శాఖ నిబంధనలు అతిక్రమించి మోటార్ వాహనాలు నడిపితే ప్రమాదకరం, మరియు చట్ట రీత్యా నేరం అని, నూతనంగా మార్పు చేసిన నిబంధనలు పాటించకపోతే వేలల్లో అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ పేర్కొన్నారు. అలాగే హెల్మెట్ ధరించటం తప్పని సరి అని, హెల్మెట్ రవాణా శాఖ నిబంధన తో పాటు వాహన చోదకులు ప్రాణ రక్షణ గా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ మేరకు నిబంధనలు వున్పటికి ప్రజలు నిర్లక్ష్యం వహించడం వల్లనే ప్రాణాలు కోల్పోతున్నారని, ముఖ్యం గా చిన్న వయసున్న వారికి మోటార్ వాహనాలు ఇస్తే వాటి మీద అదనంగా అపరాధ రుసుము వసూళు ,, అవసరాన్ని బట్టి కేసు లు నమోదు చేస్తామని ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు.

## దళిత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలోవిద్యార్థులకు కెరీర్ గైడెన్స్



తాళ్లపూడి, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మలకపల్లి దళిత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్ పాసైన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేశారు. ఇటీవల విడుదలైన పది, ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మరపట్ల అరుణ్ కుమార్ ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏ.ఎస్.ఓ జోడాల వెంకట్ మాట్లాడుతూ యువత ఏదయినా సాదించాలి అంటే అది చదువు ద్వారానే సాధ్యం అన్నారు. . పది, ఇంటర్ పాసైన విద్యార్థులు ఏ కోర్సులు చదివితే మంచిది అనే విషయాన్ని తెలియజేసారు. యువతను ముందుకు తీసుకు వెళ్ళడానికి తన వంతు సహాయం చేస్తానన్నారు, శెట్టిమాలి మోహన్ మాట్లాడుతూ, డా.అంబేద్కర్ ను ఆదర్శం గా తీసుకుని కష్టపడి చదివి పోటీ ప్రపంచంలో విజయం సాదించాలన్నారు. డి.ఎస్.ఎఫ్ అధ్యక్షులు నేరేడిమెల్లి చంద్ర శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పూర్తిగా చదువుమీదే ద్రుష్టి పెట్టాలి, సమయం వృధా చేయకూడదన్నారు రానున్న కాలంలో విద్యార్థుల కోసం లైబ్రరీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డి.ఎస్.ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ దాసరి హితేష్, సెక్రటరీ కొనాల అభిషేక్ వర్మ, ట్రెజరర్ దాసరి రాకేష్, కన్వీనర్స్, అడ్వైజర్స్, సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలిగింపుకు అధికారుల సహకారం



.తాళ్లపూడి, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో ఆక్రమణ లు తొలగించి గ్రామాభివృద్ధికి, పంచాయతీ తీసుకున్న నిర్ణయాల అమలుకు సహకారం అందించాలని గ్రామ సర్పంచ్ తీగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ లు ఆర్డీవో కు విన్నవించుకున్నారు. ఆక్రమణలకు గురయ్యిన స్థలాలు, గోడలను, మెట్లను, చెట్లను అన్నింటినీ గతం లోనే పంచాయితీ తీర్మానం ద్వారా కొన్ని పనులు చేయటం జరిగిందని తెలిపారు. మరికొన్ని పనులు కోసం అధికారుల సహాయం కోరామని ప్రెసిడెంట్ తిరిగి పల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ లు తెలిపారు.

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# పిజి ఆర్ఎస్ లో 176 అర్జీలు స్వీకరణ

## -అర్జీల పరిష్కార మార్గంలో అలసత్వం చూపవద్దు కలెక్టర్ పి మాధవి లత

**రాజమహేంద్రవరం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ప్రజాసమస్యల పరిష్కారం విషయం లో అలసత్వం ఉండరాదని , అర్జీ దారులు సంతృప్తి చెందేలా వాటి పరిష్కార విధానం ఉండాలని, నిర్లక్ష్యం వైఖరి ఉపేక్షించడం జరగదని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు.స్థానిక కలెక్టరేట్ లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) మీ కోసం లో సంయుక్త కలెక్టర్ ఎస్. చిన్నరాముడు తో కలిసి అర్జీలు స్వీకరించారు .అనంతరం కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం లో నిర్లక్ష్యం వహించ వద్దని తెలిపారు. తమ సమస్య పరిష్కారం కాలేదంటూ ప్రజలు తన వద్దకు మళ్ళీ మళ్ళీ వస్తే అది సంబంధిత అధికారి నిర్లక్ష్యం గా పరిగణిస్తా నన్నారు. కొన్ని సందర్భాల్లో జిల్లా స్థాయి అధికారుల కంటే సచివాలయ ఉద్యోగులు మెరుగ్గా ఎండార్స్మెంట్ ఇస్తున్నారని చెప్పారు. సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్య నివేదిక (ఏటిఆర్) సమర్పించాలన్నారు. కింది స్థాయి ఉద్యోగులు ఎలాంటి పరిష్కారం చూపారో చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారుల పై ఉందని, ప్రతిఒక్కరూ గతం లో పరిష్కారమయిన సమస్యలను పరిశీలించాలని చెప్పారు. పీజీఆర్ఎస్ కొందరు అధికారులు గైర్హాజరు కావడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం విడిచి వెళ్ళాలి అంటే తప్పని సరిగా అనుమతి ఉండాలని, ఇక నుంచి అందరూ ఈ-ఆఫీస్ ద్వారా సెలవు వివరాలు తెలియచేసి ముందస్తు అనుమతి పొందాలని ఆదేశించారు. ప్రజా సమస్య పరిష్కారం కోసం వారితో సమగ్రంగా సమస్య వివరాలు తెలుసుకోవడం వలన సగం సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఏదైనా అర్జీ పరిష్కారం సాధ్యం కాదని తెలిస్తే, అందుకు కారణాలు కూడా వివరించాల్సిన ప్రయత్నం చేయాలన్నారు. రెవెన్యూ 96 , పీఆర్ 18 , పోలీసు 16 , విద్యుత్ 11, ఇతర శాఖలకు చెందిన 35 అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు.పిజిఆర్ఎస్ లోనవొచ్చిన కొన్ని అర్జీలుచిడిపి గ్రామానికి చెందిన కవల ఏసుబాబు.. అఖండ గోదావరి నది గర్భంలో చిడిపి,కుమారదేవరం గ్రామాలకు చెందిన ప్రాంతంలో అక్రమ ఇసుక, మట్టి త్రవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదు చేశారు. పర్యావరణ అనుమతులవిషయంలో నిబంధనలు ఉల్లంఘన చేస్తున్నట్లు అర్జీ ఇచ్చారు.కొలమురు కి చెందిన కె వికాస్ సర్వే నంబర్ 210/1 డి, 210 , 210/2 విద్యుత్ లైన్ ఏర్పాటు విషయంలో ప్రక్క పొలం రైతు అడ్డు పడుతున్నారు అంటూ అర్జీ ఇచ్చారు.పెరవలి మండలం మల్లేశ్వరం కు చెందిన పి.. కృష్ణా మూర్తి స్థానిక రాజావారి వారి వీధిలో అపరిశుభ్రత వల్ల ఇబ్బందులుపై అర్జీ ఇవ్వడం జరిగింది. డిపివో ను చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ధవళేశ్వరం ఎర్ర కొండ కు చెందిన ఆర్. సన్యాసమ్మ నడక రహదారి మార్గం ఆక్రమణ జరిగిందని, నడక కోసం 4 అడుగులు రహదారి రెండు అడుగులు ఆక్రమణ కారణంగా ఇబ్బందికి చెంది దరఖాస్తు అందచేశారు.కడియం మండలం వీరవరం గ్రామంకు చెందిన డి చిన్న వీర్రాజు ఆర్ ఎస్ 166/2 ఏ స్థల వివాదం పరిష్కారం కోసం అర్జీ అందజేసారు.అనపర్తి మండలం రామవరం చింత సురేష్ రెడ్డి, ఇటీవల చింతా వారీ విధిలో నిర్మించిన సి సి రహదారి నిర్మాణం నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడం పై అర్జీ ఇవ్వడం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి సీతారామ మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు ప్రేమ్ కుమార్, భాగ్యలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి (జే డి ) ఎల్. అప్పలకొండ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ అమ్మవారికి మామిడిపండ్లతో అలంకరణ

**భీమవరం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



వైశాఖ మాసం సందర్భంగా పంచారామక్షేత్రమైన భీమవరం సోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానంలోని అన్నపూర్ణ అమ్మవారికి సోమవారం మామిడిపండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఈవో పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మామిడిపండ్లతో పూజ చేసి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# పయనీర్ మహేంద్ర షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యేలు



## అంజిబాబు, రఘురామ

**భీమవరం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భీమవరం - ఉండి రోడ్డులో పయనీర్ మహేంద్ర షోరూంను సోమవారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఏపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు ప్రారంభించారు. భారతదేశంలో అతితక్కువ కాలంలోనే ప్రజాధారణ పొందిన సంస్థ మహీంద్ర అని, మన ప్రాంతంలో 11వ బ్రాంచ్ గా పయనీర్ మహేంద్ర షోరూంను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, యర్రంశెట్టి శివకృష్ణ, షోరూం డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్, సేల్స్ మేనేజర్ జి మహేష్, కమర్షియల్ మేనేజర్ కే సుబ్బారావు, వేగేశ్న వెంకట విశ్వనాథరాజు, కనుమూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డుల్లోకి సినీనటుడు శోభన్ బాబు మనవడు డా సురక్షిత్

**భీమవరం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



సినీనటుడు శోభన్ బాబు మనవడు డా సురక్షిత్ బత్తిన గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కడానికి మార్గం సుగమం అవుతోంది. ఓ మహిళ గర్భాశయంలో భారీ కణితి ఉండటంతో ఓపెన్ సర్జరీ ద్వారా కాకుండా 3డీ ల్యాపరోస్కోపీతో చాకచక్యంగా తొలగించారు. ఈ అరుదైన ఆపరేషన్ గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ప్రతిపాదనకు వెళ్లింది. తమిళనాడుకు చెందిన 44 ఏళ్ల మహిళ భారీ కణితి (ఫైబ్రాయిడ్)తో నొప్పి విపరీతంగా ఉండటాన్ని భరించలేకపోయింది. దేశంలోని వివిధ ఆసుపత్రుల్ని సంప్రదించినా దాన్ని తొలగించడం రిస్క్తో కూడుకున్నదని, ఓపెన్ సర్జరీ తప్ప మరో మార్గం లేదని చెప్పారు. డా సురక్షిత్ బత్తిన ను సంప్రదించాగా అనస్తీషియా విభాగం అభిప్రాయం తీసుకుని 8 గంటలపాటు పూర్తిస్థాయి 3డీ ల్యాపరోస్కోపీతో సర్జరీ నిర్వహించి భారీ కణితి ఉన్న 4.5 కిలోల గర్భాశయాన్ని తీసేశారు. ప్రస్తుతం ఇది గిన్నిస్ వరల్డ్ రికార్డు పరిశీలనలో ఉంది. మరి కొన్నివారాల్లో అధికారిక ప్రకటన వస్తున్నట్లు సురక్షిత్ తెలిపారు. అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి భట్టిప్రోలు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, పూడి శ్రీనివాస్, బి బాల సుబ్రమణ్యం, టి వీరప్రసాద్, టి సాయికామరాజు, కుర్ర రాంబాబు, యు విజయ్, ఎస్ఎన్ రావు, బొండా రాంబాబు, లంకలపల్లి చాముండేశ్వరావు, అభినందనలు తెలిపి గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించాలని కోరుకుంటున్నామన్నారు.

# పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం" కార్యక్రమంలో 35 అర్జీల స్వీకరణ.

## -నిర్ధేశించిన సమయంలో చట్టపరిధిలో అర్జీలు పరిష్కరించాలి.- .తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహా కిషోర్



**రాజమహేంద్రవరం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం" (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహా కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి, వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నర్సింహా కిషోర్ మాట్లాడుతూ... అర్జీలకు నాణ్యతతోపాటు నిర్ధేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను పరిశీలించి నాణ్యతతో చట్ట పరిధిలో వాటినీ పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు "పి.జి.ఆర్.ఎస్" కార్యక్రమానికి 35 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు, దొంగతనం కేసులు మరియు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఎడ్మిన్) ఎన్. బి. ఎం. మురళీకృష్ణ , అడిషనల్ ఎస్పి( క్రైమ్) అర్జున్, డి.ఎస్.పి( ఎస్ బి) బి. రామకృష్ణ , ఇన్స్పెక్టర్( ఎస్ బి) శ్రీనివాస రావు, ఇన్స్పెక్టర్( డి సి ఆర్ బి) పవన్ కుమార్ రెడ్డి ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## - మీ కోసం లో 19 అర్జీలను స్వీకరించడం జరిగింది - కమిషనర్ కేతన గార్గ్



**రాజమహేంద్రవరం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిచిన"పి జి ఆర్ ఎస్ - మీ కోసం"లో ప్రజల నుంచి 19 అర్జీలను స్వీకరించడం జరిగిందని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలియ చేశారు.సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కేతన గార్గ్ మాట్లాడుతూ, నగర పాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణా, మౌలిక సదుపాయాలు కల్పించడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.మీకోసం లో స్వీకరించిన కొన్ని అర్జీలు : రాజమహేంద్రవరానికి చెందిన గంగరాజు వెంకట్రావు అనే వ్యక్తి గతంలో అర్జీ నెంబర్ 25 03175720 దరఖాస్తు ద్వారా తమకు సమస్యను నిర్ణయించు కున్నాము, కానీ సమస్య పరిష్కారం ఆనందన మరల సమస్యను తమ దృష్టికి తీసుకువస్తున్నందున పరిష్కరించ వలసినదిగా కోరుతూ అర్జీ.రాజమహేంద్రవరానికి చెందిన గోసాల చక్రవర్తి అనే వ్యక్తి తనకు సర్వే 17 లో 2.03 సెంట్లు భూమి ఉన్నదని పట్టాదారు పాసుపుస్తకం నందు తన పేరు నమోదు కాలేదని సమస్యను పరిష్కరించ వలసిందిగా దరఖాస్తు నందు కోరి ఉన్నారు.కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన దంతం శెట్టి చిన వీర్రాజు అనే వ్యక్తి రాజానగరం మండలం రాజానగరం గ్రామమునందు ఆర్ఎస్ నెంబర్ 166/ 2ఏ లో తాను కొనుగోలు చేసిన స్థలం వివాదం పరిష్కరించవలసినదిగా కోరుతూ దరఖాస్తు. అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన చింతా సురేష్ రెడ్డి అనే వ్యక్తి గ్రామపంచాయతీ వారు వేసిన సిమెంట్ రోడ్డు అసంపూర్తిగా వదిలేసి పర్మిషన్ లేకుండా వెళ్లిపోయినందున సమస్యను పరిష్కరించవలసిందిగా దరఖాస్తు నందు పేర్కొన్నారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర రావు, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వి. వినూత్న, ఎస్.ఈ ఎం సిహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరంలో "పయనీర్" మహేంద్ర షోరూం ప్రారంభం



**రాజమహేంద్రవరం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆటోమొబైల్ రంగంలోమహేంద్ర వాహనాలు ప్రజాదరణ పొందాయని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు అన్నారు. స్థానిక వీరభద్రపురంలో పయనీర్ మహేంద్ర ప్రైవేట్ లిమిటెడ్ రెండవ షోరూంను సోమవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రారంభించారు. పయనీర్ అంటే చుక్కపల్లి కుటుంబం గుర్తుకు వస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కొత్తపేట నివాసి పప్పుల వెంకటేసుకు మహేంద్ర తార్ కారు కీ అందజేశారు. షోరూమ్ అధినేత చుక్కపల్లి రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పయనీర్ మహేంద్ర షోరూం గుంటూరులో ఉందని, రెండవదిగా రాజమండ్రిలో ప్రారంభించామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ఆధునిక డిజైన్లలో మహేంద్ర వాహనాలు వినియోగదారుల ఆదరణ చూరకుంటున్నాయాన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పవన్, తానేశ్వర్, పయనీర్ షోరూం అధినేతలు చుక్కపల్లి రమేష్, చుక్కపల్లి రాకేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మకు ఘన సత్కారం

## -సారధ్యం వహించిన నగర బ్రాహ్మణ సేవాసంఘం రాజమండ్రి అధ్యక్షుడు పుట్రేవు సూర్య వెంకటరావు

**రాజమహేంద్రవరం, మే 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



రాష్ట్రంలోని బ్రాహ్మణులను ప్రభుత్వం గుర్తించేలా చేసి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ( ఎపిబిఎస్ఎస్ఎస్) అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ చెప్పారు.రాష్ట్ర నూతన అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సతీష్ శర్మకు నగర బ్రాహ్మణ సేవా సంఘం రాజమండ్రి అధ్యక్షుడు పుట్రేవు సూర్య వెంకటరావు సారధ్యంలో కుమారి థియేటర్ ఎదురుగా ఉన్న జూపూడి ఫంక్షన్ హాలులో అభినందన సత్కారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరించి చైర్మన్ ను ఏర్పాటు చేయడంతో పాటు బ్రాహ్మణులకు మళ్ళీ సంక్షేమ పథకాలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.గతంలో కూడా బ్రాహ్మణ జాతికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబు నాయుడిదేనని కొనియాడారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాదాయ ధర్మాదాయ శాఖ పాలకవర్గాల్లో బ్రాహ్మణులను సభ్యులుగా నియమించేందుకు జివో జారీ చేశారని, బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.324 కోట్లు కేటాయించారని సతీష్ శర్మ తెలిపారు. డిసెంబర్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అభినందన సత్కారసభ ఏర్పాటు చేసి సంఘీయుల సంక్షేమానికి,ఆర్థిక పురోభివృద్ధికి సహకరించాలని కోరుతామని ఆయన చెప్పారు.రాష్ట్రం లోని బ్రాహ్మణ యువత, విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి నైపుణ్యాలు పెంచి యువతీయువకులకు సాఫ్ట్వేర్ రంగంలో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బ్రాహ్మణ మహిళల సాధికారత, స్వావలంబనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సతీష్ శర్మ చెప్పారు.సమాఖ్యలో 1000 మంది సభ్యులను చేర్పించి సభ్యత్వ రుసుమును కార్పస్ ఫండ్ గా ఏర్పాటు చేసి విద్యార్థులకు,వృద్ధ మహిళలకు సహాయం చేసే కార్యక్రమాలు చేపడతామని సతీష్ శర్మ తెలిపారు.కంచికామకోటి పీఠాధిపతిని అన్నవరం నుంచి అందించిన తూర్పుగోదావరి ఎంతో పుణ్యప్రదమైన జిల్లా అని ఆయనకొనియాడారు.సభకు అధ్యక్షత వహించిన పుట్రేవు సూర్య వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని బ్రాహ్మణుల్లో ఐక్యత సాధించేందుకు కృషి చేస్తున్న సతీష్ శర్మ అపర చాణక్యుడని అభివర్ణించారు. నగర బ్రాహ్మణ సేవాసంఘాన్ని త్వరలో రాష్ట్ర సమాఖ్యలో విలీనం చేస్తామని చెప్పారు.రాష్ట్ర సమాఖ్యకు తన పరిధిలో 250 సభ్యత్వాలు కట్టిస్తామని, ప్రస్తుతం 100 సభ్యత్వాలు చేయిస్తున్నామని పుట్రేవు సూర్య వెంకటరావు చెప్పారు.రాష్ట్ర సమాఖ్య కార్యదర్శి కోత్తపల్లి శ్రీదేవి మాట్లాడుతూ బ్రాహ్మణ మహిళలు ఉన్నత విద్యతో డాక్టర్, ఇంజనీర్లు ఇతర ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు.ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో మహిళలు ఐక్యంగా ముందుకు వెళ్ళాలని, సమాఖ్య సభ్యులుగా చేరాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు.ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో బ్రాహ్మణ గర్జన నిర్వహించాలని శ్రీదేవి కోరారు.రాష్ట్ర సమాఖ్య సలహా, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గా ప్రసాద్, కోశాధికారి పులిపాక ప్రసాద్,సలహా కమిటీ డైరెక్టర్ కె.వి.ఎల్.ఎన్.రామచంద్రమూర్తి, రాష్ట్ర అధికార ప్రతినిధి వాడ్రేవు వేణుగోపాలరావు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సూర్య కుమారి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కలగ ప్రభాకరం, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు సూరంపూడి కామేష్, ఉపాధ్యక్షుడు పుట్రేవు ఉపేంద్ర కుమార్,శ్రీగాయత్రీ పురోహిత సమాఖ్య అధ్యక్షుడు భాగవతి నారాయణ శాస్త్రి (బాబి) రాజమండ్రి నగర సంఘం ప్రధాన కార్యదర్శి భాగవతుల వెంకట రమణమూర్తి, కోశాధికారి ప్రయాగ సుబ్రహ్మణ్యం తదితరులు ప్రసంగించారు.నగరంలోని బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు రాష్ట్ర సమాఖ్య నూతన అధ్యక్షుడు సతీష్ శర్మను పూలమాలలువేసి ఘనంగా సత్కరించారు.

# రిషభ్ పంత్.. నువ్వు ధోనీకి కాల్ చేయ్: సెహ్వాగ్



టీమిండియా స్టార్ ఆటగాడు రిషభ్ పంత్ () ఐపీఎల్ 2025 సీజన్ ప్రయాణం పేలవంగా సాగుతోంది. కీలక సమయాల్లోనూ జట్టును గెలిపించేంత ఇన్నింగ్స్‌ను ఆడలేకపోవడం గమనార్హం. కేవలం ఒక్క హాఫ్ సెంచరీ చేసిన పంత్ 11 మ్యాచుల్లో 128 పరుగులే చేశాడు. పంజాబ్‌పై 17 బంతుల్లో కేవలం 18 పరుగులే చేశాడు. అతడి ఫామ్‌పై మాజీ క్రికెటర్లు వీరేంద్ర సెహ్వాగ్, షాన్ పొలాక్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈసందర్భంగా పంత్‌కు సెహ్వాగ్ విలువైన సూచనలు ఇచ్చాడు. ధోనీకి ఫోన్ చేసి సలహాలు తీసుకోవాలని సెహ్వాగ్ సూచించాడు.

"పంత్ నువ్వు ఆడిన పాత వీడియోలను చూడు. అప్పుడు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. స్కోరు చేసిన రోజులను గుర్తుచేసుకోవాలి. గాయపడటానికి ముందు పంత్‌కు, ఇప్పుడు పంత్‌కు చాలా వ్యత్యాసం ఉంది. పంత్‌ను చూస్తుంటే నాకు 2006/07 సీజన్ గుర్తుకొస్తుంది. నేను కూడా అప్పుడు పరుగులు చేసేందుకు ఇబ్బందిపడ్డా. భారత జట్టు నుంచి తొలగించారు. అప్పుడు రాహుల్ ద్రవిడ్ ఓ మాట చెప్పాడు. 'పరుగులు చేసిన రోజుల నుంచి నా దినచర్యను తనిఖీ చేయమని చెప్పాడు. కొన్నిసార్లు దినచర్యలో ఆటంకాలు ఉన్నప్పుడు కూడా అవి మన ఆటపై ప్రభావితం చూపుతాయి' అని అన్నాడు. ఆ తర్వాత నన్ను మెరుగుపర్చుకొనేందుకు ప్రయత్నించా" అని సెహ్వాగ్ వెల్లడించాడు.

### అలా చేయాలి..

"ఇప్పుడు నేను కూడా పంత్‌కు ఓ సలహా ఇస్తున్నా. అతడికి మొబైల్ ఉంది కదా.. దానిని తీసుకొని ఒకరికి కాల్ చేయాలి. మీకు నెగిటివ్ ఆలోచనలు వస్తున్నప్పుడు దాని నుంచి మరలడానికి వేరేవారితో చర్చించాలి. ఇందుకోసం చాలామంది క్రికెటర్లు ఉన్నారు. పంత్‌కు ధోనీ రోల్ మోడల్. అందుకే, అతడికి పంత్ కాల్ చేయాలి. ధోనీతో మాట్లాడాక తప్పకుండా పంత్ మనసు తేలికపడుతుంది" అని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు.

### పంత్‌కు అదే లోటు అనుకుంటున్నా: పొలాక్

"పంత్ విషయంలో ఇలాంటి వివరణ ఇవ్వాల్సి వస్తుందని అనుకోలేదు. అతడి ఐపీఎల్ జట్టులో భారత ప్లేయర్లు లేకపోవడం లోటుగా భావిస్తున్నాడేమో అనిపిస్తోంది. టాప్ ఆర్డర్‌లో నలుగురు అంతర్జాతీయ ప్లేయర్లు అదీనూ విదేశీ ఆటగాళ్లే ఉన్నారు. కాబట్టి, అతడి భావాలను స్వతంత్రంగా వ్యక్తంచేయడానికి సరైన సహచరుడు లేడేమోనని అనిపిస్తోంది" అని దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు షాన్ పొలాక్ తెలిపాడు.

# మేం స్వేచ్ఛగా ఆడాల్సిన సమయమిదే: కరుణ్ నాయర్

ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఢిల్లీ క్యాపిటల్స్ ఐదో స్థానంలో కొనసాగుతోంది. పది మ్యాచుల్లో ఐదు విజయాలు నమోదు చేసిన ఢిల్లీ.. ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే మిగిలిన నాలుగింట్లో కనీసం రెండు మ్యాచుల్లో గెలవాలి. ఇవాళ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఢిల్లీ తలపడనుంది. ఈ క్రమంలో తమ గేమ్ ప్లాన్‌పై ఢిల్లీ బ్యాటర్ కరుణ్ నాయర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. నిర్భయంగా, స్వేచ్ఛగా ఆడేసే సమయం ఆసన్నమైందని పేర్కొన్నాడు.



"మాకు ప్రతి మ్యాచ్ విజయం కీలకం. జట్టులో జోష్ తెప్పించాల్సిన అవసరం ఉంది. ఈ సీజన్‌లో అన్ని మ్యాచుల్లో విజయం సాధించేందుకు తీవ్రంగా శ్రమించాం. ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్నాం. ముమ్ముందు మ్యాచుల్లో మరింత స్వేచ్ఛగా ఆడేందుకు ప్రయత్నిస్తాం. మేం కుదురుకునేందుకు మాకు తగినంత సమయం దొరికింది. కీలక సమయంలో దూకుడుగా ఆడాల్సిన అవసరం ఉంది. నేను ఇప్పటికీ బాగానే బ్యాటింగ్ చేస్తున్నా. అయితే, 20 పరుగులను పెద్ద స్కోర్లుగా మలచాలి. ఒక్కోసారి ఆ 20 పరుగులే ప్రభావం చూపించే అవకాశం లేకపోలేదు" అని కరుణ్ నాయర్ వెల్లడించాడు.

### స్మరన్ స్థానంలో హర్ష్ దూబె

సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్లేఆఫ్స్ అవకాశాలు తక్కువే కానీ.. ప్రతి మ్యాచ్‌లో గెలవాల్సిందే. ఈ క్రమంలో ఎస్‌ఆర్‌హెచ్ ఆటగాడు స్మరన్ రవిచంద్రన్ గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలిగాడు. అతడికి బదులు దేశవాళీ స్టార్ హర్ష్ దూబెను సన్‌రైజర్స్ తీసుకుంది. రూ. 30 లక్షల ప్రాథమిక ధరకే సన్‌రైజర్స్ జట్టుతో హర్ష్ చేరనున్నాడు. 22 ఏళ్ల హర్ష్ దూబె దేశవాళీలో 16 టీ20లు ఆడి 9 వికెట్లు పడగొట్టాడు.

# సన్‌రైజర్స్‌తో ఢిల్లీ కీలక పోరు

హైదరాబాద్:

భారీ అంచనాలతో ఈ సీజన్‌ను మొదలుపెట్టి, పేలవ ప్రదర్శనతో దాదాపు ప్లేఆఫ్ బెర్తుకు దూరమైన సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతగడ్డపై మరో పోరుకు సిద్ధమైంది. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను సన్‌రైజర్స్ ఢీకొట్టనుంది. 10 మ్యాచ్‌ల్లో ఏడింట్లో ఓడి.. మూడింట్లో నెగ్గిన సన్‌రైజర్స్ 6 పాయింట్లతో పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది. మిగతా 4 మ్యాచ్‌ల్లోనూ గెలిచినా సన్‌రైజర్స్‌కు ప్లేఆఫ్ బెర్తు దక్కుతుందన్న నమ్మకం లేదు. అద్భుతాలేమైనా జరిగి 14 పాయింట్లు సాధించిన జట్లన్నీ నాలుగో స్థానానికి పోటీపడితే.. అప్పుడు సన్‌రైజర్స్ రన్‌రేట్ మెరుగ్గా ఉంటే ప్లేఆఫ్ బెర్తు దక్కొచ్చు! అలా జరగాలంటే అనేక సమీకరణాలు తోడవ్వాలి. కానీ అది దాదాపు అసాధ్యంగానే కనిపిస్తోంది. కాబట్టి ఆఖరి నాలుగు మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శనతో పట్టికలో కొంచెం పైకి వెళ్లడానికి సన్‌రైజర్స్ ప్రయత్నించాల్సిందే. ఇక 10 మ్యాచ్‌ల్లో ఆరింట్లో నెగ్గి.. నాల్గింట్లో ఓడిన ఢిల్లీ 12 పాయింట్లతో అయిదో స్థానంలో కొనసాగుతోంది. ప్లేఆఫ్ రేసులో నిలవాలంటే ఢిల్లీ కచ్చితంగా గెలవాల్సిందే. గత రెండు మ్యాచ్‌ల్లో ఓడి ప్లేఆఫ్ అవకాశాల్ని సంక్లిష్టం చేసుకున్న ఢిల్లీ.. సన్‌రైజర్స్‌తో పోరులో సర్వశక్తులు ఒడ్డుతుందనడంలో సందేహం లేదు.



# బ్యాటింగ్ ఆర్డర్‌లో సతమతం అదే పంత్ ఇబ్బందికి కారణమా?



ఓ పక్కన కుర్రాళ్లు దంచేస్తున్నారు. టీమిండియా స్టార్ బ్యాటర్లు పరుగులు రాబట్టేస్తున్నారు. కానీ, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సారథి రిషభ్ పంత్ ఆటతీరు మాత్రం నానాటికీ తీసికట్టుగా మారిపోయింది. తాజాగా పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లోనూ తేలిపోయాడు. బ్యాటింగ్ ఆర్డర్ విషయంలోనే అతడు సతమతమవుతున్నాడనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

10 ఇన్నింగ్స్‌లో కేవలం 128 పరుగులు, 99 స్ట్రైక్‌రేట్. ఇవేవో బౌలర్ గణాంకాలు అనుకొనేరు. ఐపీఎల్ 2025 సీజన్‌లో లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్ పంత్ నమోదు చేసిన పరుగులు. కొన్నిసార్లు ఓపెనర్‌గా వచ్చాడు. మరికొన్ని మ్యాచుల్లో సెకండ్ డౌన్‌లో ఆడాడు. ఏడో స్థానంలోనూ బ్యాటింగ్‌కు దిగాడు. ఇలా బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులతో పంత్ ఆటతీరు దారుణంగా తయారైందనడంలో సందేహం లేదు. గ్రూప్ స్టేజ్‌లో లఖ్‌నవూ వరుసగా మూడు మ్యాచుల్లో ఓడిపోవడానికి ఇదే ప్రధాన కారణం. తనకు అచ్చొచ్చే స్థానం ఏంటనేది మేనేజ్‌మెంట్ గుర్తించకపోవడమే లఖ్‌నవూకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది.

### అప్పుడు మూడో స్థానంలో..

రిషభ్ పంత్ 2022 చివర్లో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో 2023 ఐపీఎల్‌లో ఆడలేదు. గత సీజన్‌లో మళ్లీ క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. 13 మ్యాచుల్లోనే 446 పరుగులు చేసి అదరగొట్టాడు. అయితే, నాలుగో స్థానంలోనే బ్యాటింగ్‌కు వచ్చిన అతడు మెరుగ్గా రాణించాడు. దీంతో టీ20 ప్రపంచకప్ జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన పంత్ అక్కడ తన ప్లేస్‌ను మార్చుకొన్నాడు. వన్‌డౌన్‌లో ఆడాడు. 8 మ్యాచుల్లో 171 పరుగులు చేసి భారత్ వరల్డ్ కప్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈసారి మాత్రం పేలవ ఆటతీరుతో విమర్శలు ఎదుర్కోవడం గమనార్హం. ఐపీఎల్‌లో తనకు అచ్చొచ్చే నాలుగోస్థానంలో ఆడుతున్నా.. పరుగులు చేయడంలో మాత్రం ఇబ్బంది పడుతూనే ఉన్నాడు. ఒకవేళ ఇదే కొనసాగితే మాత్రం భారత జట్టుకు ఆడటమూ కష్టమేనని క్రికెట్ విశ్లేషకుల అంచనా. ఇప్పటికే జట్టులో తీవ్ర పోటీ ఉన్న సంగతి తెలిసిందే.

### ప్రైస్ ట్యాగ్.. కెప్టెన్సీ భారం..

మెగా వేలంలో పంత్‌ను లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రూ.27 కోట్లకు తీసుకుంది. దీంతో అతడిపై భారీ అంచనాలు మొదలయ్యాయి. వాటిని తట్టుకోవడంలో పంత్ విఫలమయ్యాడనే వ్యాఖ్యలు వినిపించాయి. మొన్నటి వరకు ఢిల్లీని బాగా నడిపిన అతడిపై కెప్టెన్సీ భారం ఉంటుందంటే ఎవరూ నమ్మరు. అయితే, పంత్ పరిస్థితిపై మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప స్పందిస్తూ.. " రిషభ్ పంత్ చాలా అయోమయంలో ఉన్నాడు. అతడి పాత్రపై స్పష్టత లేదనిపిస్తోంది. పంత్ మూడో స్థానంలో బాగా ఆడాడు. గత టీ20 ప్రపంచకప్‌లో అతడు వన్‌డౌన్‌లో బాగా రాణించాడు. ఈ సీజన్‌లో సీఎస్కేపై హాఫ్ సెంచరీ బాదాడు. ప్రత్యర్థి బౌలింగ్‌పై ఎటాక్ చేయడాన్ని పంత్ ఆస్వాదిస్తాడు" అని వ్యాఖ్యానించాడు.

# వైభవ్‌కు ప్రధాని మోదీ ప్రశంస



పట్నా:

**టీనేజ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు కురిపించాడు. "ఐపీఎల్‌లో బిహార్ బిడ్డ వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శన చూశా. చిన్న వయసులో గొప్ప రికార్డు నెలకొల్పాడు. వైభవ్ ప్రదర్శన వెనుక ఎంతో శ్రమ ఉంది" అని మోదీ అన్నారు. బిహార్‌లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆయన మాట్లాడుతూ.. వైభవ్‌ను కొనియాడారు. క్రీడాకారులు ఎంత ఎక్కువగా ఆడితే అంత బాగా మెరుగుపడతారని ప్రధాని అన్నారు. 14 ఏళ్ల వైభవ్ (రాజస్థాన్ రాయల్స్) గుజరాత్‌పై 35 బంతుల్లోనే సెంచరీ చేసి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.**

వైభవ్‌ను జాగ్రత్తగా కాపాడండి.. ఛాపెల్: రాజస్థాన్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని జాగ్రత్తగా కాపాడాలని బీసీసీఐకి, ఐపీఎల్ ఫ్రాంచైజీలకు, మీడియాకు ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ గ్రెగ్ ఛాపెల్ సూచించాడు. అతడిని సచిన్ తెండుల్కర్‌లా తయారు చేయాలని.. వినోద్ కాంబ్లి, పృథ్వీ షా మాదిరిగా కానీయొద్దని ఛాపెల్ అన్నాడు. "సచిన్ కుర్రాడిగా ఉన్నప్పుడు కేవలం ప్రతిభతోనే విజయవంతం కాలేదు. బలమైన మద్దతు వ్యవస్థ, క్రమశిక్షణ, తెలివైన కోచ్, మంచి కుటుంబం సచిన్‌ను గందరగోళం నుంచి కాపాడాయి. అదే సమయంలో అంతే ప్రతిభావంతుడు, బహుశా ఇంకాస్త మెరుగైన బ్యాటర్ కాంబ్లి పేరు, క్రమశిక్షణను సమతుల్యం చేసుకోలేక ఇబ్బందిపడ్డాడు. అతని ఎదుగుదల మాదిరే పతనం కూడా నాటకీయంగానే సాగింది. మరో అద్భుత ప్రతిభావంతుడు పృథ్వీ షా గాడితప్పాడు. వైభవ్‌ను బీసీసీఐ, ఫ్రాంచైజీలు, మెంటార్లు, మీడియా జాగ్రత్తగా కాపాడాలి. అతి ప్రచారం, మార్కెటింగ్ చేయడకుండా చక్కగా సానబెట్టాలి" అని ఛాపెల్ పేర్కొన్నాడు.

## 'మండాడి' ఫస్ట్‌లుక్ పోస్టర్ రిలీజ్




**కోలీవుడ్ స్టైలిష్ రా అండ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా "మండాడి"లో సుహాస్ శక్తివంతమైన ఎంట్రీ**

కోలీవుడ్‌లోని అత్యంత ప్రతిష్టాత్మక దర్శకుల్లో ఒకరైన వెట్రిమారన్ పాఠశాలలో రూపొందుతున్న తాజా చిత్రం "మండాడి" ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతోంది. ఈ చిత్రంలో టాలీవుడ్‌కు చెందిన ప్రతిభావంతులైన యువ నటుడు సుహాస్ ఒక కీలక పాత్రలో నటించడం విశేషం. గత కొంతకాలంగా విభిన్నమైన కథలతో, తన ప్రత్యేకమైన నటనతో గుర్తింపు పొందిన సుహాస్‌కు ఇది తమిళ చిత్ర పరిశ్రమలో ఓ గంభీర ఆరంభంగా నిలవబోతోంది. తాజాగా విడుదలైన ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సుహాస్ అందంగా కాదు.. రా అండ్ రఫ్ లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేశారు. ఇదే వెట్రిమారన్ టచ్. అతని స్టైల్‌కి దగ్గరగా ఉండే, ఊహించని మలుపులతో కూడిన కథనాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారతాయి.వెట్రిమారన్ సినిమాలంటేనే ఓ రేంజ్ ఉంటుంది. సామాజిక చింతనతో కూడిన కథనాలు, భయపడేంత గాఢమైన భావోద్వేగాలు, జీవముంటే లాంటి పాత్రలు, నేపథ్య సంగీతం ఇవన్నీ కలిపి ఆయన్ని ప్రత్యేక దర్శకుడిగా నిలిపాయి. ఇప్పుడు అదే పంథాలో "మండాడి" అనే స్పోర్ట్స్ డ్రామాను మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో తీస్తున్నారు. ఈ చిత్రం కథలో మానవ సంబంధాలు, క్రీడలతో ముడిపడిన రాజకీయాలు, సామాజిక పోరాటం అన్నీ సమపాళ్లలో మేళవించబడ్డాయని సమాచారం.ఈ చిత్రంలో సుహాస్ పాత్ర కీలకమైనదే కాకుండా, అతని పాత్ర చుట్టూ కథ సాగేలా ఉందట. తమిళ సినీ పరిశ్రమలోకి ప్రవేశిస్తున్న సుహాస్‌కు ఇది సుదీర్ఘ ప్రయాణానికి అద్భుతమైన మొదటి అడుగు అని చెప్పొచ్చు. ఆయన ఈ పాత్ర కోసం ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకున్నట్లు టాక్.బలమైన తారాగణం అంచనాలకు తగ్గ సన్నివేశాలుఈ చిత్రంలో కోలీవుడ్ స్టార్ కమెడియన్ అయిన సూరి కూడా ఓ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. గతంలో "విదుతలై" వంటి సినిమాల్లో నటనతో మెప్పించిన సూరి, ఇప్పుడు సీరియస్ పాత్రల్లో కూడా తనదైన ముద్ర వేయబోతున్నాడు. అలాగే మహిమా నంబియార్ హీరోయిన్‌గా అలరించనుండగా, సత్యరాజ్, అచ్యుత్ కుమార్, సచ్చనా నమిదాస్, రవీంద్ర విజయ్ వంటి నటులు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ కథను, పాత్రల విలువను మరింత ఉత్కృష్టంగా మార్చేందుకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన బిజీ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రానికి రా అండ్ రస్టిక్ స్టైల్ అతి ముఖ్యమైన అంశం కానుంది. ఊరి బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ, లోతైన భావోద్వేగాల మధ్య ఉండే సున్నితమైన సంఘర్షణలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటాయని సమాచారం.సర్ప్రైజ్‌లతో నిండిన "మండాడి" ప్రేక్షకుల కోసం ఎదురు చూపులుచిత్ర యూనిట్ సమాచారం ప్రకారం, ఈ సినిమాలో అనేక ఆశ్చర్యాలు దాగి ఉన్నాయి. ప్రతి పాత్ర ఓ కథను చెబుతుంది. ప్రతి క్షణం ఊహించని మలుపులు తీసుకుంటుంది. సినిమా విడుదలకు ముందు ఈ సర్ప్రైజ్‌లను బట్టబయలు చేయనప్పటికీ, ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచేలా ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నారు. తమిళంతో పాటు తెలుగులో కూడా ఈ సినిమాను విడుదల చేయడమంటేనే వెట్రిమారన్ బ్యానర్‌కు తెలుగులోనూ మంచి గుర్తింపు ఉందన్న స్పష్టత.




## విజయ్ దేవరకొండను వదిలేస్తారా



రౌడీ హీరో విజయ్ దేవరకొండ చేసిన కామెంట్స్ వల్ల చిక్కుల్లో పడ్డాడు. రెట్రో మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు గెస్ట్ గా వెళ్లిన విజయ్ అంతకు ముందు జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడులపై స్పందించాడు.ఆ సందర్భంగా అతను పాకిస్తాను ఉద్దేశిస్తూ.. ఇప్పటికీ ఇంకా 500 యేళ్ల క్రితం ట్రైబల్స్ లాగా కొట్టుకోవడం ఏంటీ అని యధాలాపంగా అన్నాడు. దీంతో మా మనోభావాలు దెబ్బతిన్నాయి అంటూ గిరిజనలు విజయ్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేస్ లు పెట్టే ప్రయత్నం చేశారు. కేస్ నమోదైంది కూడా.అయితే దీనికి విజయ్ దేవరకొండ సుదీర్ఘమైన వివరణ ఇచ్చాడు. ట్రైబల్ అనే మాటకు ఉన్న అర్థాలు వివరిస్తూ ఎవరినీ కించపరచాలన్న ఉద్దేశ్యం తనకు లేదని స్పష్టం చేశాడు. అలాగే తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరించే ప్రయత్నం చేస్తూ ఆఖర్లో ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే సారీ అని కూడా చెప్పాడు. దీంతో కొంత వరకూ గొడవ చల్లారింది అనుకుంటున్నారు కానీ.. కొందరు దీన్ని ఇప్పట్లో వదిలేలా లేరు. అతనిపై నమోదైన కేస్ ను వెనక్కి తీసుకునేలానూ లేరు. నిజానికి అతని కామెంట్స్ లో జాతి గురించిన ఉద్దేశ్యాలేం లేవు అని ఎవరికైనా అర్థం అవుతుంది. కానీ సినిమా వాళ్లు ఎప్పుడూ ఈజీ టార్గెట్ అవుతారు కదా. అందుకే ఇలా..రౌడీ హీరో విజయ్ దేవరకొండ చేసిన కామెంట్స్ వల్ల చిక్కుల్లో పడ్డాడు. రెట్రో మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు గెస్ట్ గా వెళ్లిన విజయ్ అంతకు ముందు జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడులపై స్పందించాడు. ఆ సందర్భంగా అతను పాకిస్తాను ఉద్దేశిస్తూ.. ఇప్పటికీ ఇంకా 500 యేళ్ల క్రితం ట్రైబల్స్ లాగా కొట్టుకోవడం ఏంటీ అని యధాలాపంగా అన్నాడు. దీంతో మా మనోభావాలు దెబ్బతిన్నాయి అంటూ గిరిజనలు విజయ్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేస్ లు పెట్టే ప్రయత్నం చేశారు. కేస్ నమోదైంది కూడా.

## బూమిల్క్ బ్యూటీ తమన్నా లేటెస్ట్ పోస్ట్.. లుకింగ్ హార్డ్ అంటూ ఫ్యాన్స్ కామెంట్స్



టాలీవుడ్ హీరోయిన్ తమన్నా భాటియా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ఈ బ్యూటీ అనేక చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల మనసు దోచేసింది.ఈమె అద్భుతంగా నటించి.. జనాల్ని మెప్పించింది. ఇటీవలే ఈ హీరోయిన్ నటించిన ఓదెల -2 సినిమాలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.ఈ మూవీ నుంచి విడుదలైన పోస్టర్లు, టీజరే జనాల్లో విపరీతమైన హైప్ పెంచాయి. ఇక సినిమా విడుదలయ్యాక ఓదెల 2 బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. బాక్సాఫీసు వద్ద వసూళ్ల వర్షం కురిపించిందని చెప్పుకోవచ్చు. ఈ మూవీలో తమన్నా భాటియా ప్రధాన పాత్రలో నటించి మెప్పించింది.ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకత్వం వహించారు. అలాగే ఈ సినిమాకు సంపత్ నంది రచయిగా వ్యవహరించారు. హెబ్బా పటేల్, వశిష్ట, ఎన్ సింహ ప్రధాన పాత్రలో నటించారు. ఈ మూవీలో మిల్క్ బ్యూటీ తమన్నా నాగసాధువుగా కనిపించింది.ఇకపోతే ఈ ముద్దుగుమ్మ ఓ వైపు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ.. సోషల్ మీడియాలోని అభిమానులతో టచ్‌లో ఉంటుంది. తాజాగా ఈ మిల్క్ బ్యూటీ నెట్టింట ఓ పోస్ట్ పెట్టింది. స్టైలిష్ డ్రెస్ ధరించి.. స్టన్నింగ్ స్టిల్స్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిక్స్ వీక్షించిన నెటిజన్లు లుకింగ్ హార్డ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

## వీరమల్లు వస్తే ఎవరికి టెన్షన్




హ రిహర వీరమల్లు షఉటింగ్ కు ముగింపుకొచ్చేసింది. సెట్స్ లో నిన్నటి నుంచి పవన్ కళ్యాణ్ హాజరు కావడంతో టీమ్ ఉత్సహంగా పరుగులు పెడుతోంది. మే ఎనిమిది లేదా తొమ్మిది తేదీల్లో గుమ్మడికాయ కొట్టడం దాదాపు ఫిక్స్. ఇక డబ్బింగ్ ఇతరత్రా కార్యక్రమాలు మూడో వారంలోగా పూర్తి చేయాలనేది టార్గెట్. ఇప్పుడు అసలు సవాల్ విడుదల తేదీ. మే 30 కింగ్ డమ్ ఉంది. ఒకవేళ అదే తేదీ కావాలనుకుంటే సితార సంస్థ వాయిదా వేసుకోవడానికి వెనుకాడదు. కాకపోతే వీలైనంత ముందుగా నిర్ణయం తీసుకుంటే దానికి అనుగుణంగా కొత్త డేట్ ఏది వేసుకోవాలో విజయ్ దేవరకొండ టీమ్ ప్లాన్ చేసుకుంటుంది.లేదూ వీరమల్లు జూన్ మొదటి వారంలో రావాలంటే కమల్ హాసన్ తగ్ లైఫ్ ఉంది. దాని వల్ల తెలుగు వర్షన్ కొచ్చిన ఇబ్బందేం లేదు కానీ తమిళనాడు, కేరళలో పవన్ సినిమాని మార్కెట్ చేసుకోవడం, థియేటర్లు దక్కించుకోవడం కష్టమవుతుంది. పైగా బజ్ ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల వీరమల్లు ప్రమోషన్ల మీద దృష్టి పెట్టేందుకు అవసరమైనంత సమయం దక్కేలా చూసుకోవడం అవసరం. అలాంటప్పుడు కమల్ తో క్లాష్ ఎంతవరకు సేఫనేది రకరకాల సమీకరణాల మీద ఆధారపడి ఉంటుంది. అదే నెలలో కుబేర, కన్నప్పలు ఉన్నాయి. ఒకవేళ పవన్ వస్తానంటే నాగార్జున, మంచు విష్ణు ఎలా స్పందిస్తారో చూడాలి.ఎందుకంటే కన్నప్ప, కుబేరలు కూడా ఇప్పటికే విపరీతమైన జాప్యానికి గురయ్యాయి. ఇంతకన్నా లేట్ చేయడానికి లేదు. ఒకవేళ వీటిలో ఏదైనా లేదా హరిహరవీరమల్లు కనక జూన్ వద్దనుకుంటే మిగిలింది జూలై ఒక్కటే. ఆగస్ట్ లో వార్ 2, కూలి దృష్ట్యా ఛాన్స్ లేదు. పార్ట్ 2 బిజినెస్ కు పార్ట్ 1 సక్సెస్ కీలకం కాబట్టి వీరమల్లుకి సోలో రిలీజ్ చాలా ముఖ్యం. నిర్మాత ఏఎం రత్నం వీలైనంత వరకు అదే ప్రయత్నంలో ఉన్నారు. దర్శకుడు జ్యోతికృష్ణ షఉట్ తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగవంతం చేశారు. పవన్ రిక్వెస్ట్ మేరకు త్రివిక్రమ్ కొంత పర్యవేక్షణ చేస్తున్నారనే టాక్ వచ్చింది కానీ అదేమీ లేదు. కేవలం పలకరింపు కోసమే వచ్చారట.

## కుషితా కల్లపు.. ఓ ఎమోజీ వెనక దాగిన కథ..



సముద్రతీరంలో కాఫీతో కలసిన హాయిగా పండిన చిరునవ్వు, స్టైలిష్ బ్లూ టాప్, నలుపు పెంట్, కలలతో నిండిన కళ్లతో కుషితా కల్లపు తాజా ఇన్‌స్టాగ్రామ్ ఫోటో నెటిజన్ల మనసు దోచుకుంటోంది.ఆమె క్యాప్షన్ కూడా అంతే ఇంట్రిగింగ్‌గా ఉంది.. రెండు పినాటా ఎమోజీలు, ఓ రాబిట్ మాత్రమే..! ఇదేంటి అర్థమయ్యేలా లేదని చాలామందే కామెంట్ చేస్తున్నారు, కానీ ఆమె అంతర్లీన భావాన్ని అందుకోగలిగినవారికి ఇది ఒక సంకేతంలా ఉందని తెలుస్తోంది.ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్ పెంచుకున్న మరొక ఫ్యాషన్ ఇన్‌ఫ్లూయెన్సరేనా..? అని మొదట అనిపించవచ్చు. కానీ కుషితా కథ అంతలో అంత ముగిసిపోదు. ఆమె ఒక నటిగా, యూట్యూబ్ కంటెంట్ క్రియేటర్‌గా తనదైన గుర్తింపు సంపాదించుకుంది. హైదరాబాద్ వేదికగా, సోషల్ మీడియా నుంచి సినీ రంగం వరకు ప్రయాణించిన ఆమె, తన లుక్స్ మాత్రమే కాదు, వ్యక్తిత్వంతోనూ, అభినయ నైపుణ్యంతోనూ ఆకట్టుకుంటోంది. 2023లో విడుదలైన 'నీతొనే నేను' చిత్రంలో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. అలాగే 'మనోహరం' అనే మరో సినిమాలోనూ కనిపించింది. అయితే త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించిన 'గుంటూరు కారం' సినిమాలో భాగం అయినప్పటికీ, ఆమె సీన్లు చివరికి ఫైనల్ ఎడిట్‌లో తొలగించబడ్డాయి. ఈ విషయమై ఆమె వ్యక్తిగతంగా నిరాశ వ్యక్తం చేసిన సందర్భమూ ఉంది. తాను మాత్రమే కాదు, మరికొందరు నటుల సీన్లు కూడా కట్ చేశారని చెప్పడం ఆమె సూటిగా మాట్లాడే ధోరణిని సూచిస్తుంది.ప్రస్తుతం ఆమె '3 రోజెస్' సీక్వెల్‌లో నటిస్తూ బిజీగా ఉన్నారు. కంటెంట్ క్రియేషన్‌లోనూ, నటనలోనూ కలబోసిన ఈ మిలమిల మెరుస్తున్న యాంకర్, యాక్ట్రస్, ఇన్‌ఫ్లూయెన్సర్%ె% తన కథను ఇంకా చెప్పాల్సి ఉంది. కుషితా కల్లపు సోషల్ మీడియా ద్వారా వచ్చినవారికే కాదు, తన పని తీరు, వ్యక్తిత్వం ద్వారా ఆకట్టుకునే వారికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. ఒక్కోసారి ఓ ఎమోజీ వెనక ఒక కొత్త అధ్యాయం దాగి ఉంటుంది కదా..

## వార్ 2లో ఎన్టీఆర్ స్క్రీన్ టైం.. రెమ్యూనరేషన్ లెక్కలు ఇవే..



టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం పాన్ ఇండియా లెవెల్లో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వార్ 2 సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనున్నాడు.ఈ సినిమాను స్పై యూనివర్స్ లో కీలక ఘట్టంగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్ పై ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. హృతిక్ రోషన్ వార్ సినిమాలో.. కబీర్ రోల్‌లో కనిపించనున్నాడు. ఇప్పటికే హిందీలో తెరకెక్కి మంచి సక్సెస్ అందుకున్న వార్‌కి సీక్వెల్ గా ఈ సినిమా రూపొందింది. ఇక వార్ సినిమాలో తన పాత్రని హృతిక్ రోషన్ పార్ట్ 2 లోను కంటిన్యూ చేస్తుండగా.. ఈ సినిమాల్లో కొత్తగా తారక్ క్యారెక్టర్ యాడ్ అయింది. ఇలాంటి క్రమంలో ఎన్టీఆర్ పాత్ర ఎలా ఉండబోతుంది.. పాత్ర నడివి.. రెమ్యూనరేషన్ లాంటి అంశాలు ఫ్యాన్స్ లో ఉత్కంఠ రేపుతున్నాయి. ఎప్పుడెప్పుడు ఎన్టీఆర్ వార్ 2 సినిమా రిలీజ్ అవుతుందా అంటూ అభిమానులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.ఇలాంటి క్రమంలో సినిమాలో తారక్ స్క్రీన్ టైమ్‌కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ వైరల్ గా మారుతుంది. సినిమాలో దాదాపు 75 నుంచి 80 నిమిషాల పాత్ర నడివితో ఎన్టీఆర్ మేరవనున్నాడని.. ఆర్ఆర్ఆర్ సినిమాలో 74 నిమిషాల స్క్రీన్ టైం కంటే వార్ 2 సినిమాలో ఎన్టీఆర్ స్క్రీన్ టైం మరింతగా ఉండనుందని.. ఎన్టీఆర్‌ను ఈ రోల్‌లో ఎంతో కీలకంగా, పవర్ ఫుల్ గా చూపించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే సినిమా మూడు గంటల పైనే ఉంటుందని తారక్, హృతిక్ ఇద్దరు సమానంగా స్క్రీన్ ను షేర్ చేసుకోబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఎస్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్ పై వచ్చిన సినిమాలన్నీ 150 నుంచి 160 నిమిషాల నడివితో తెరకెక్కగా.. ప్రస్తుతం వస్తున్న యానిమల్, పుష్ప ది రూల్ లాంటి సినిమాలు మూడు గంటల పైన నడివితోను బ్లాక్ బస్టర్ అందుకున్న క్రమంలో.. వార్ 2 విషయంలో యష్ రాజ్ ఫిలిమ్స్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నారట.ఇటీవల.. హృతిక్ జపాన్ కత్తితో యాక్షన్ సీన్స్ చేస్తూ ఉన్న వీడియో నెటింట తెగ వైరల్‌గా మారింది. దీంతో సినిమాపై మరింత హైప్ పెరిగింది .అంతేకాదు.. సినిమాలో ఎన్టీఆర్ ఉండడం మరింత హైలెట్. ఈ క్రమంలోనే వాటితో సినిమాకు భారీ లెవెల్లో బిజినెస్ జరుగుతుందని సమాచారం. కాగా.. సినిమాల్లో ఎన్టీఆర్, హృతిక్ ఇద్దరి పాత్ర నడివి సమానంగా ఉన్న క్రమంలోనే ఇద్దరి రెమ్యునరేషన్ కూడా సమానంగా ఉందని.. ఇద్దరు సినిమా కోసం రూ.100 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటున్నారని సమాచారం. ఇందులో వాస్తవం ఏంటో తెలియదు గాని ప్రస్తుతం ఇదే న్యూస్ నెటింట తెగ వైరల్‌గా మారడంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తారక్ ఫ్యూచర్లో కూడా ఇలాంటి ఎన్నో క్రేజీ ప్రాజెక్టులో నటించాలని.. మరిన్ని బ్లాక్ బస్టర్లు అందుకుని మార్కెట్లో అంతకంతకు క్రేజ్ పెంచుకోవాలని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339